# మనం

# మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల, నారాయణ పేట, వనపర్తి

బుధవారం | 5 | ఆగస్టు | 2026 | పేజీలు 12 | www.manamepaper.com





## పెబ్బేరు మిల్లుల్లో భారీగా

# ధాన్యం మాయం

### ధాన్యం కొరత వ్యవహారంలో కొత్త లెక్కలు

### విజిలెన్స్ రిపోర్టుపై అనుమానాలు

2



వనపర్తి జిల్లాలోని పెబ్బేరుకు చెందిన మూడు బియ్యం మిల్లుల్లో ధాన్యం కొరత కేసు మళ్లీ చర్చకు వచ్చింది. గత ఏడాది 3.6 లక్షల బస్తాల కొరత ఉందని అధికారులు నివేదించగా, తాజాగా విజిలెన్స్ అధికారులు 1 లక్ష బస్తాల కొరత మాత్రమే ఉందని నివేదిక ఇవ్వడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాయి గోపాల్ ఇండో టెక్ ప్లాంట్, సాయి గణేష్ రైస్ మిల్, సాయి గార్నేష్ రైస్ మిల్‌లలో గత ఏడాది తనిఖీల్లో సుమారు 6 కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ధాన్యం, అదనంగా 30 కోట్ల రూపాయల విలువైన ధాన్యం లెక్కలు తేలలేదని ...అప్పటి అధికారులు మొత్తంగా 37 కోట్లరూపాయల ధాన్యం మాయమైనట్లు గుర్తించారు.. *– వనపర్తి ఆగస్టు 4 (మనం ప్రతినిధి)*



శ్రీశైలం ప్రాజెక్టు (ఫైల్)

## శ్రీశైలం జలాశయానికి

# ఉధృతంగా వరద

### 2.08 లక్షల క్యూసెక్కుల నీటి రాక

### అప్రమత్తంగా అధికారులు

అచ్చంపేట, ఆగస్టు 4 (మనం న్యూస్) : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న విస్తారమైన వర్షాల ప్రభావంతో శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు చేరుతోంది. మంగళవారం ఉదయం 9 గంటల నాటికి జలాశయాని కి 2,08,594 క్యూసెక్కుల వరద ప్రవాహం నమోదైనట్లు ప్రాజెక్టు అధికారులు వెల్లడించారు. వరద ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యంలో జలాశయ పరిస్థితిని

- మిగతా 2లో..

## మారుమూల గ్రామాల క్రీడాకారులను

# గుర్తించడమే ప్రభుత్వ లక్ష్యం

### వంకేశ్వరం గ్రామంలో మినీ స్టేడియం నిర్మాణానికి వేగం పెంచాలి

### ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మౌలిక సదు-పాయాలను మరింత బలోపేతం చేసి, యు-వతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేలా మినీ స్టేడియం నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఎంపిక చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ అధికారులను సూచించారు.




వివరాలు 2లో..

## జూరాల ప్రాజెక్టు

# 30 గేట్లు ఎత్తివేత

### 2.34 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల



2

# పెబ్బేరు మిల్లుల్లో భారీగా ధాన్యం మాయం

వనపర్తి ఆగస్టు 4 (మనం ప్రతినిధి) : అందులో సాయి గార్వేష్ పేరుతో ఫేక్ మిల్లు కూడా ఉందని ఆరోపణలు వచ్చాయి. అయితే తాజాగా విజిలెన్స్ డిఎస్పి శ్రీనివాసులు తన టీం సమక్షంలో తనిఖీలు చేసి 1 లక్ష బస్తాలు మాత్రమే లేనట్లు నివేదిక ఇచ్చారు.దీంతో






"అప్పుడు 3.6 లక్షల బస్తాలు లేనిది ఇప్పుడు ఎలా వచ్చాయి " అంటూ పలువురు మిల్లర్లు మరియు ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఈ మూడు మిల్లులను కాపాడేందుకు పెద్ద మొత్తంలో ముడుపులు చేతులు మారాయనే ప్రచారం జరుగుతోంది. రాష్ట్రస్థాయి కీలక విభాగ అధికారులు సైతం ఇందులో ప్రమేయం ఉందనే వినికిడి జోరందుకుంది. జిల్లా ఉన్నతాధికారికి కూడా పెద్ద మొత్తంలో తీసుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మిల్లర్లు మాత్రం విజిలెన్స్ అధికారులే తనిఖీల పేరుతో భారీ అవినీతికి పాల్పడి ధాన్యం అమ్ముకున్న మిల్లర్ కు అనుకూలంగా రిపోర్టు రాశారని ఆరోపిస్తున్నారు. దీంతో ప్రజల్లో రాష్ట్ర ఉన్నతస్థాయి విభాగంపై నమ్మకం సన్నగిల్లుతోందనే చర్చ జరుగుతోంది. ప్రభుత్వం తక్షణం ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించి వాస్తవాలు ప్రజల ముందు ఉంచాలని ప్రజలు కోరుతున్నారు. గత ఏడాది 3.6 లక్షల బస్తాలు అని, ఇప్పుడు 1 లక్ష బస్తాలు అని రెండు రిపోర్టులు రావడం విజిలెన్సు అధికారుల విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. రాజకీయ ఒత్తిళ్లు, ఆర్థిక లావాదేవీల ప్రభావంతో దర్యాప్తు దిశ మారుతుందనే అనుమానాలు బలపడుతున్నాయి. పారదర్శక విచారణ జరగకపోతే ప్రభుత్వంపైనే ప్రజల విశ్వాసం దెబ్బతినే ప్రమాదం ఉంది.

# మారుమూల గ్రామాల క్రీడాకారులను గుర్తించడమే ప్రభుత్వ లక్ష్యం

ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 04 (మనం బ్యూరో) : అచ్చంపేట నియోజకవర్గంలోని పదర మండలం వంకేశ్వరం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న మినీ స్టేడియం కోసం ప్రతిపాదించిన ప్రభుత్వ భూమిని మంగళవారం జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించారు. పదర మండలంలోని వంకేశ్వరం గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్-254లో ఉన్న 3 ఎకరాల 4 గుంటల స్థలాన్ని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. స్థల విస్తీర్ణం, భూ స్వరూపం, రాకపోకల సౌకర్యం, భవిష్యత్ విస్తరణ అవకాశాలు, మినీ స్టేడియం నిర్మాణానికి అనుకూలత వంటి అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక అంశాలపై అధికారులతో చర్చించి అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..., రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి గ్రామీణ యువకుడు తన ప్రతిభను ప్రదర్శించుకునేందుకు నాణ్యమైన క్రీడా వేదికలు అందుబాటులో ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామ స్థాయి నుంచే క్రీడలను ప్రోత్సహించడం ద్వారా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచే క్రీడాకారులు తయారవుతారన్నారు. వంకేశ్వరం గ్రామంలో ప్రతిపాదిత మినీ స్టేడియం



నిర్మాణం పూర్తయిన తర్వాత పదర మండలంతో పాటు పరిసర గ్రామాల యువతకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ తెలిపారు. క్రీడల పట్ల ఆసక్తి ఉన్న యువతకు శిక్షణ, సాధన, పోటీల నిర్వహణకు అవసరమైన వేదికగా ఈ మినీ స్టేడియం నిలుస్తుందని చెప్పారు. గ్రామీణ యువతలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో ఇటువంటి క్రీడా మౌలిక సదుపాయాలు కీలక పాత్ర పోషిస్తాయని, స్టేడియం నిర్మాణానికి సంబంధించిన భూ రికార్డులు, సర్వే ప్రక్రియ, సాంకేతిక అనుమతులు, పరిపాలనా ప్రతిపాదనలు తదితర అంశాలను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్మాణానికి అవసరమైన అన్ని ప్రక్రియలను వేగవంతం చేసి, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనులను ముందుకు తీసుకెళ్లాలన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులో ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరే విధంగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని క్రీడా మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన అధికారులకు సూచించారు. అనంతరం ప్రతిపాదిత స్థలాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, సంబంధిత శాఖల అధికారుల నుంచి పూర్తి వివరాలు తెలుసుకుని, అవసరమైన నివేదికలను తక్షణమే సిద్ధం చేసి సమర్పించాలని రెవిన్యూ అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి రేవంత్ చంద్ర, ఎంపీడీవో సుధాకర్, వంకేశ్వరం గ్రామ సర్పంచ్ మౌనిక, పంచాయతీ కార్యదర్శి రమ్య, సర్వేయర్ విజయనిర్మల, ఎస్ఐతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీశైలం జలాశయానికి ఉధృతంగా వరద

మొదటి పేజీ తరువాయి

అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నారు. అధికారుల వివరాల ప్రకారం, ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 101.921 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు (269.750 మీటర్లు) కాగా, ప్రస్తుతం నీటి మట్టం లి858.70 అడుగులు (261.725 మీటర్లు)లిగా నమోదైంది. జలాశయం మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలు. జలాశయానికి వస్తున్న వరదలో జూరాల జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,369 క్యూసెక్కులు, జూరాల స్పిల్‌వే ద్వారా 1,80,225 క్యూసెక్కులు శ్రీశైలం జలాశయానికి చేరుతున్నాయి. దీంతో జలాశయంలోకి భారీగా నీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం జలాశయం నుంచి స్పిల్‌వే గేట్ల ద్వారా ఎలాంటి నీటి విడుదల చేపట్టడం లేదని అధికారులు తెలిపారు. అలాగే కుడి, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రాల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని కూడా తాత్కాలికంగా నిలిపివేశారు. వరద ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యంలో నీటి మట్టం పెరుగుదలను నిరంతరం పరిశీలిస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. వాతావరణ శాఖ ఎగువ ప్రాంతాల్లో మరికొన్ని రోజుల పాటు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని సూచించిన నేపథ్యంలో శ్రీశైలం జలాశయ పరిస్థితిపై ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. అవసరమైతే పరిస్థితిని బట్టి నీటి విడుదలపై నిర్ణయం తీసుకుంటామని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జలాశయ పరిసర ప్రాంతాల ప్రజలు, భక్తులు, పర్యాటకులు అధికారుల సూచనలు పాటించాలని, నది పరివాహక ప్రాంతాలకు అనవసరంగా వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.




# జూరాల ప్రాజెక్టు 30 గేట్లు ఎత్తివేత

వనపర్తి ఆగస్టు 4 (మనం ప్రతినిధి) : ఎగువన ఉన్న మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులోకి 2,30,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, అధికారులు 30 గేట్లు ఎత్తి 2,34,629 క్యూసెక్కులను దిగువన ఉన్న శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా, ప్రస్తుతం 317.57 మీటర్లుగా ఉంది. పూర్తిస్థాయి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 7.778 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఎగువ, దిగువ జూరాల జలవిద్యుత్ కేంద్రాల్లోని 11 యూనిట్ల ద్వారా 434 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

## ఆగస్టు 10లోగా యూనిఫాం కుట్టు పనులు పూర్తి చేయాలి

### అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

వనపర్తి ఆగస్టు 4 (మనం ప్రతినిధి) ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇవ్వనున్న దుస్తుల కుట్టు పనులను ఆగస్టు 10లోగా పూర్తి చేసి పాఠశాలలకు సకాలంలో అందజేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. మంగళవారం వనపర్తి పట్టణంలోని స్వయం



సహాయక సంఘాల కుట్టు కేంద్రాన్ని, రాజపేట గ్రామంలోని కుట్టు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కుట్టు పనుల పురోగతిని అడిగి తెలుసుకుని నాణ్యతలో రాజీపడొద్దని సూచించారు. ప్రతి దుస్తును నిర్దేశిత ప్రమాణాల ప్రకారం కుట్టాలని, ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని అధికారులకు చెప్పారు. పిల్లలకు ఇబ్బంది కలగకుండా సకాలంలో దుస్తులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పరిశీలనలో పురపాలక కమిషనర్ నిరంజన్, అధికారులు, కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# పాఠశాలల అభివృద్ధి, విద్యా ప్రమాణాల సాధనలో ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకం

### మహబూబ్ నగర్ జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్




ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 04 (మనం బ్యూరో) : మాడల్ బేసిక్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మధుసూదన్ నాయక్ అదేవిధంగా జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,... ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాల పెంపు, నాణ్యమైన విద్య అందించడం వంటి అంశాల్లో ప్రధానోపాధ్యాయుల బాధ్యత అత్యంత కీలకమని పేర్కొన్నారు. విద్యారంగంలో తెలంగాణ రాష్ట్రంలో మహబూబ్‌నగర్ జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపే బాధ్యత ప్రతి ప్రధానోపాధ్యాయుడిపై ఉందన్నారు. ఆ లక్ష్య సాధన కోసం అంకిత భావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు జిల్లా యంత్రాంగం తరఫున తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. అధికారులు, ప్రధానోపాధ్యాయులు సమిష్టిగా పనిచేస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచవచ్చని ఆయన పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారి విజయకుమారి మాట్లాడుతూ పాఠశాల నిర్వహణలో ప్రధానోపాధ్యాయులది అత్యంత కీలకమైన నాయకత్వ పాత్ర అని పేర్కొన్నారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయ బృందాన్ని, విద్యార్థులను నిరంతరం ప్రోత్సహిస్తూ, విద్యా ప్రమాణాల పెంపు దిశగా ప్రధానోపాధ్యాయులు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. అదేవిధంగా, విద్యార్థుల అభ్యాస ఫలితాలు, పాఠశాల అభివృద్ధి, సమర్థవంతమైన నిర్వహణ వంటి అంశాల్లో మెరుగైన పనితీరును కనబరుస్తూ, పర్ఫార్మెన్స్ గ్రేడ్ ఇండికేటర్స్ (PGI) లో తెలంగాణ రాష్ట్రంలోనే మహబూబ్‌నగర్ జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి ప్రధానోపాధ్యాయుడు బాధ్యతాయుతంగా కృషి చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, సెంటర్ ఇంచార్జ్ బాసిత్ , డీఆర్పీ లు పాల్గొన్నారు.



# సైబర్ నేరలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఏఎస్ఐ పాండయ్య

చారకొండ,ఆగస్టు04(మనం న్యూస్) : మండల ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ పాండయ్య అన్నారు.మంగళవారం చారకొండ పోలీస్ స్టేషన్ ఆవరణలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ...మండల ప్రజలు ఎవరైనా చరవాణిలో లోన్స్ ఇస్తాము ఓటిపి చెప్పమని ఫోన్ చేస్తే బయట వ్యక్తులకు మీ సంబంధిత రహస్య పిన్ నెంబర్లు,ఓటిపి చెప్పకూడదని అన్నారు.గ్రామాలలో వ్యాపారం పేరుతో బయటి వ్యక్తులు ఎవరు లేని సమయంలో వచ్చి ఇండ్లకు తాళాలు వేసిన ఇండ్లలో చోరీలకు పాల్పడతారని,కనుక ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సమాచారం అందించాలని తెలియపరచారు.గ్రామాలలో యువత,వ్యాపారస్తులు,ప్రజలు అందరి సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడానికి సహకరించాలని అన్నారు. ఆన్లైన్లో అపరిచిత వ్యక్తులతో పరిచయం ఏర్పాటు చేసుకొని మీ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ తిరుమలరావు,కానిస్టేబుళ్లు,ప్రజలు సుధాకర్,లాలు,శ్రీను,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణ పనులపై ఆర్అండ్‌బీ ఈఈ శ్రీధర్ తనిఖీ

### సీసీ రోడ్డు పనుల వేగం, నాణ్యతపై సంతృప్తి

### త్వరలో కంసానిపల్లిలో రోడ్డు విస్తరణ ప్రారంభం



ఉప్పునుంతల, ఆగస్టు 4 (మనం న్యూస్) : మండల కేంద్రం ఉప్పునుంతల నుంచి కంసానిపల్లి వెళ్లే ప్రధాన రహదారి విస్తరణ, అభివృద్ధి పనులను రోడ్లు--భవనాల (ఆర్అండ్‌బీ) శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) శ్రీధర్ మంగళవారం పరిశీలించారు. ఉప్పునుంతల పోచమ్మ చౌరస్తా (సర్కిల్) వద్ద చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన ఆయన, పనులు వేగవంతంగా, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తవుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని పరిశీలించిన ఈఈ శ్రీధర్, నిర్మాణంలో ఎలాంటి నాణ్యతా లోపాలు తలెత్తకుండా ప్రతి దశలో జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నిర్ణీత గడువులోపు పనులను వేగంగా పూర్తి చేసిన కాంట్రాక్టర్ తిప్పర్తి నరసింహారెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, రాకపోకలకు అనువుగా పనులను పూర్తి చేయడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. పోచమ్మ చౌరస్తా వద్ద రోడ్డు నిర్మాణం పూర్తికావడంతో ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న తమ ఆకాంక్ష నెరవేరిందని స్థానిక గ్రామస్తులు ఈఈ శ్రీధర్‌కు తెలిపారు. ఈ రహదారి అభివృద్ధి వల్ల ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు ప్రయాణికులకు సౌకర్యం కలుగుతుందని వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చింతగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ప్రత్యేక చొరవ, సహకారంతో పోచమ్మ చౌరస్తా అభివృద్ధి పనులు వేగంగా కొనసాగడం గ్రామానికి గర్వకారణమని అన్నారు. అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో పూర్తయ్యేలా కృషి చేసిన ఆర్అండ్‌బీ శాఖ అధికారులు, సిబ్బంది, గుత్తేదారులను ఆయన అభినందించారు.

**త్వరలో కంసానిపల్లిలో రోడ్డు విస్తరణ పనులు**

అనంతరం ఈఈ శ్రీధర్ కంసానిపల్లి గ్రామాన్ని సందర్శించి అక్కడ చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు సంబంధించిన ప్రాంతాన్ని పరిశీలించారు. గ్రామంలో త్వరలోనే రోడ్డు విస్తరణ పనులను ప్రారంభిస్తామని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలకు ఎలాంటి భంగం కలగకుండా, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరే విధంగా పనులు చేపట్టాలని గుత్తేదారు తిప్పర్తి నరసింహారెడ్డికి సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈ) శిరీష్ కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) సయ్యద్ షోలాదిద్దీన్, గ్రామ సర్పంచ్ చింతగాళ్ల శ్రీనివాసులు, గుత్తేదారులు తిప్పర్తి నరసింహారెడ్డి, నవీన్ రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.




# తల్లిపాలే శిశువు సంపూర్ణ ఆరోగ్యానికి రక్షణ

### తల్లిపాల వారోత్సవాల అంగన్‌వాడీ కార్యకర్త సోనమ్మఅవగాహన

ఉప్పునుంతల, ఆగష్టు 4 (మనం న్యూస్): శిశువు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తల్లిపాలే తొలి ఆహారం, తొలి రక్షణ కవచమని అంగన్‌వాడీ కార్యకర్త సోనమ్మ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మంగళవారం మండలంలోని దేవదారికుంట తండా అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బిడ్డ జన్మించిన వెంటనే తల్లి నుంచి వచ్చే ముర్రు పాలను (కొలస్ట్రం) తప్పనిసరిగా పట్టించాలని సూచించారు. ముర్రు పాలలో ఉండే పోషకాలు, రోగనిరోధక శక్తిని పెంచే అంశాలు శిశువుకు జీవితాంతం ఆరోగ్యకరమైన పునాదిని వేస్తాయని వివరించారు. పుట్టిన మొదటి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, నీరు లేదా ఇతర ఆహార పదార్థాలు ఇవ్వాల్సిన అవసరం లేదని తెలిపారు.ఆరు నెలల వయస్సు పూర్తైన తర్వాత తల్లిపాలతో పాటు వయస్సుకు తగిన అనుబంధ ఆహారాన్ని అందించాలని, అలాగే రెండు సంవత్సరాల వయస్సు వచ్చే వరకు తల్లిపాలను కొనసాగించడం వల్ల పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల మెరుగ్గా ఉంటుందని పేర్కొన్నారు. తల్లిపాలు తాగే పిల్లలు అంటువ్యాధుల బారిన పడే అవకాశం తక్కువగా ఉండటంతో పాటు జీర్ణక్రియ కూడా మెరుగ్గా ఉంటుందని చెప్పారు.ప్రతి తల్లి తన బిడ్డకు తల్లిపాలు అందించడం ద్వారా కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని సోనమ్మ తెలిపారు. తల్లిపాల వల్ల తల్లికి కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని, శిశువుతో భావోద్వేగ అనుబంధం మరింత బలపడుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, గ్రామ మహిళలు పాల్గొని తల్లిపాలపై ఉన్న సందేహాలను నివృత్తి చేసుకున్నారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ అంగన్‌వాడీ సిబ్బంది పలు సూచనలు, ఆరోగ్య సలహాలు అందించి అవగాహన కల్పించారు.

# మైనారిటీస్ గురుకులాల ఆహార సరఫరా టెండర్ల ప్రక్రియ పూర్తి

### జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి సయ్యద్ అక్బర్ పాషా

ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 04 (మనం బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మైనారిటీస్ గురుకుల పాఠశాలలు, కళాశాలలకు అవసరమైన కూరగాయలు, పండ్లు,చికెన్,మటన్ సరఫరా కోసం దాఖలైన టెండర్లను మంగళవారం 04వ తేదీన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధు మోహన్ సమక్షంలో తెరిచి పరిశీలించడం జరిగిందని జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి సయ్యద్ అక్బర్ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టెండర్ల ప్రక్రియలో సంబంధిత టెండర్ దారులందరు పాల్గొనడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.





## ఉచిత కోచింగ్‌తో ఉద్యోగ లక్ష్యం చేరుకోండి

### ప్రభుత్వ అవకాశాలను వదులుకోవద్దు!

### ఎస్సీ స్టడీ సర్కిల్‌పై కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆకస్మిక తనిఖీ

### విద్యార్థులకు కీలక సూచనలు

మహబూబ్‌నగర్, ఆగస్టు 4(మనం ప్రతినిధి) : ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత కోచింగ్ అవకాశాలు విద్యార్థుల జీవితాలను మార్చగల శక్తివంతమైన సాధనమని, వాటిని పూర్తిగా సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పిలుపునిచ్చారు. కష్టపడే వారికి ప్రభుత్వ ఉద్యోగం దూరం కాదని, లక్ష్యంపై దృష్టి పెట్టి క్రమశిక్షణతో ముందుకు సాగాలని ఆమె విద్యార్థులకు సూచించారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని శ్రీనివాస్ కాలనీలో ఉన్న ఎస్సీ స్టడీ సర్కిల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి అక్కడి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న బోధన, భోజన సదుపాయాలు, శిక్షణ నిర్వహణ, హాజరు శాతం వంటి అంశాలపై నేరుగా ఆరా తీశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడిన కలెక్టర్, వారి సమస్యలు, అవసరాలు తెలుసుకున్నారు. స్టడీ సర్కిల్‌లో డిజిటల్ బోర్డు, ఆధునిక స్టడీ చెయర్స్, కంప్యూటర్లు అవసరమని విద్యార్థులు ఆమె దృష్టికి తీసుకెళ్లగా, వాటిపై సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. అంతేకాకుండా కలెక్టర్ స్వయంగా తరగతి గదిలో విద్యార్థులతో కలిసి కూర్చొని బోధన విధానాన్ని పరిశీలించడం విశేషం. ఎస్ఎస్సీ, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్, గ్రూప్స్ తదితర పోటీ పరీక్షలకు అందిస్తున్న శిక్షణ నాణ్యత, కోచింగ్ వ్యవధి, అధ్యాపకుల పనితీరుపై నిర్వాహకులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం 93 మంది విద్యార్థులకు ఐదు నెలల ఉచిత ఫౌండేషన్ కోర్సు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం రిజిస్టర్లు, హాజరు వివరాలు, శిక్షణ రికార్డులను పరిశీలించి నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, "ప్రభుత్వం కల్పిస్తున్న ప్రతి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే నిరంతర శ్రమ, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం అవసరం. లక్ష్యాన్ని స్పష్టంగా నిర్దేశించుకుని ముందుకు సాగితే ప్రభుత్వ ఉద్యోగం సాధించడం అసాధ్యం కాదు" అని ప్రేరణాత్మక సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కాడం శ్రీనివాస్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత శిక్షణ అవకాశాలు వేలాది నిరుద్యోగ యువతకు ఆశాకిరణంగా మారుతున్న నేపథ్యంలో, కలెక్టర్ ఆకస్మిక తనిఖీ స్టడీ సర్కిల్‌ల పనితీరుపై మరింత బాధ్యతను పెంచిందని విద్యార్థులు అభిప్రాయపడుతున్నారు.

## నాగవరంలో తల్లిపాల వారోత్సవాలు

### చిన్నారులకు బాలామృతం తినిపించిన మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్

వనపర్తి ఆగస్టు 4 (మనం ప్రతినిధి) ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని 10వ వార్డు నాగవరం అంగన్వాడీ కేంద్రంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్పర్సన్ మధుసూదన్ గౌడ్ పాల్గొని చిన్నారులకు బాలమృతం తినిపించారు. తల్లిపాలు, పోషకాహారం యొక్క ప్రాముఖ్యతను గురించి తల్లులకు అవగాహన కల్పించారు. పుట్టిన మొదటి 6 నెలల పాటు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలని, ఆ తర్వాత బాలమృతం వంటి పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహార పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తల్లులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు. కార్యక్రమానికి వచ్చిన తల్లులకు పోషకాహారం, పిల్లల సంరక్షణపై అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు. చిన్నారుల ఆరోగ్యం, ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూపర్వైజర్ కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాలని, ముఖ్యంగా తల్లి, బిడ్డల ఆరోగ్యంపై అందరూ శ్రద్ధ వహించాలని వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్ తెలిపారు.



## పుస్తకాల మార్కులతోనే భవిష్యత్ గెలవలేరు

### నైపుణ్యాలే నిజమైన ఆయుధం

### కలెక్టర్ ఖుష్బూ గుప్తా

### మొబైల్ మోజుకు దూరంగా ఉండండి..

### AI, టెక్నాలజీని అందిపుచ్చుకోండి



మహబూబ్‌నగర్, ఆగస్టు 4 (మనం ప్రతినిధి) : "కేవలం డిగ్రీలు, మార్కులు సంపాదించడం మాత్రమే విజయానికి కొలమానం కాదు... మారుతున్న ప్రపంచాన్ని అర్థం చేసుకుని నైపుణ్యాలను పెంపొందించుకున్న వారే రేపటి నాయకులు అవుతారు" అని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా విద్యార్థులకు స్పష్టమైన సందేశం ఇచ్చారు. మంగళవారం మహబూబ్‌నగర్‌లోని పి.ఎం. శ్రీ కేంద్రీయ విద్యాలయంను సందర్శించిన ఆమె, నూతనంగా ఏర్పాటు చేసిన స్కిల్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్ను ప్రారంభించి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రపంచం వేగంగా కృత్రిమ మేధస్సు (ఏఐ), సాంకేతిక విప్లవం వైపు దూసుకుపోతున్న సమయంలో పాత పద్ధతులకే పరిమితమైతే అవకాశాలు చేజారిపోతాయని హెచ్చరించారు. "రేపటి ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే పాఠ్య పుస్తకాల జ్ఞానం ఒక్కటే సరిపోదు. సమస్య లను పరిష్కరించే సామర్థ్యం, సృజనాత్మక ఆలోచనలు, సాంకేతిక నైపుణ్యాలు, ఆవిష్కరణలపై అవగాహన తప్పనిసరి" అని ఆమె పేర్కొన్నారు. పి.ఎం. శ్రీ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక మౌలిక వసతులు, స్మార్ట్ తరగతి గదులు, అత్యాధునిక ప్రయోగశాలలు, క్రీడా సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. విద్యార్థులను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. టింకరింగ్ ల్యాబ్‌లు, వృత్తి విద్యా ప్రయోగశాలలు, ఇన్నోవేషన్ సెంటర్లు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, సృజనాత్మకతను పెంపొందిస్తా యని చెప్పా రు. విద్యార్థులు కేవలం ఉద్యోగాల కోసం కాకుండా, ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించా రు. "మొబైల్ బానిసత్వం భవిష్యత్‌ను నాశనం చేస్తుంది. అనంతరం 12వ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడిన కలెక్టర్, మొబైల్ ఫోన్లకు బానిసలుగా మారొద్దని హెచ్చరించారు. "సోషల్ మీడియా మోజులో విలువైన సమయాన్ని వృథా చేయకుండా, లక్ష్యంపై దృష్టి పెట్టాలి. చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రమశిక్షణతో కష్టపడితే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చు" అని సూచించారు. పాఠశాలలో నెలకొల్పిన క్రమశిక్షణ, పరిశుభ్రత, విద్యా ప్రమాణాలు తనను ఆకట్టుకున్నాయని పేర్కొన్న కలెక్టర్‌కు స్కౌట్స్ బృందం గౌరవ వందనం చేసింది. బాలవా టిక విద్యార్థిని పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికింది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వై. సురేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కలెక్టర్ సందేశం ఒకే వాక్యంలో "డిగ్రీ ఒక్కటే భవిష్యత్‌కు గ్యారం టీ కాదు... నైపుణ్యాలు, సృజనాత్మకత, టెక్నాలజీపై పట్టు ఉన్నవారే రేపటి ప్రపంచాన్ని నడిపిస్తారు.



## పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రీరామరక్ష : సర్పంచ్ అనుష జగపతి



చారకొండ ఆగస్ట్04(మనం న్యూస్) : పుట్టిన బిడ్డకు తల్లిపాలే అమృతంలా శ్రీరామరక్ష అని సర్పంచ్ అనూష జగపతి అన్నారు.మంగళవారం మండల పరిధిలోని జూపల్లి గ్రామంలో ప్రపంచ తల్లిపాల వార్షికోత్సవాలు అంగన్వాడి కేంద్రంలో సర్పంచ్ అనూష జగపతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.సర్పంచ్ మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాలు ప్రపంచ బెస్ట్ ఫీడింగ్ ప్రతి సంవత్సరం ఆగస్టు ఒకటో 1 వ నుండి 7 వ తేదీ వరకు ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల ప్రకారం నిర్వహించడం జరుగుతుందని ఆమె అన్నారు.పుట్టిన ప్రతి శిశువుకు మంద్రువాలు పట్టాలని,తల్లిపాలే బిడ్డకు శ్రీరామ రక్ష అని అన్నారు.తల్లిపాలలో రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందనిఆమెసూచించారు.పెరిగే పిల్లలకు మేదస్సు పరీక్షల్లో మెరుగ్గా ఉంటుందని పేర్కొన్నారు.అధిక బరువు మధుమేహం వంటి సమస్యనునివారించవచ్చని,రెండు సంవత్సరాల వరకు తల్ల బెస్ట్ ఫీడింగ్ వల్ల తల్లులకు గర్భాశయ,అండాశయం తోపాటు బెస్ట్ ఆన్సర్ కూడా వచ్చే అవకాశాలు చాలా అరుదుగా ఉంటాయని ఈ సందర్భంగాతెలియజేశారు. అంగన్వాడీ టీచర్లు నారాయణమ్మ, కృష్ణమ్మ, సుధామనణి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## భూభారతి రీసర్వేలో పొరపాట్లకు తావివ్వొద్దు

### అదనపు కలెక్టర్ వినోద్‌కుమార్

వనపర్తి ఆగస్టు 4 (మనం ప్రతినిధి) : భూభారతి రీసర్వే ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, ఖచ్చితత్వంతో చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఘనపూర్ మండలం మల్కాపూర్ గ్రామంలో ఆయన పర్యటించారు. రీసర్వే పనులు, సరిహద్దుల నమోదు, డిజిటల్ మ్యాపింగ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని సూచించారు. అనంతరం గ్రామంలోని రెండు బియ్యం మిల్లులను సందర్శించి ధాన్యం నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియ, రికార్డులను తనిఖీ చేశారు. నిబంధనల ప్రకారం మిల్లింగ్ వేగవంతం చేయడంతో పాటు బియ్యం నాణ్యతలో రాజీపడొద్దని నిర్వాహకులకు చెప్పారు. తదుపరి ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, పోషకాహార సేవలను పరిశీలించారు. పాఠశాలల్లో పరిశుభ్రత, బోధనపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.



## ఎస్సీ డిపార్ట్మెంట్ మండల అధ్యక్షుడుగా గోరేటి శివ

### నియామక పత్రం అందజేసిన ఎమ్మెల్యే

చారకొండ,ఆగస్టు04(మనం న్యూస్) : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ డిపార్ట్మెంట్ మండల అధ్యక్షుడిగా చారకొండ గోరేటి శివ ను అచ్చంపేట అంబేద్కర్ భవన్ లో మంగళవారంఏకగ్రీవంగాఎన్నుకున్నారు.నియామక పత్రాన్ని డిసిసి అధ్యక్షుడు,అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ చేతుల మీదుగా శివ అందుకోవడం జరిగింది.శివ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను గుర్తించి నాకు ఈ అవకాశం కల్పించిన అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ వంశీ కృష్ణ,జిల్లా పార్టీ నాయకులకు,మండల పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు.నాకు ఈ పదవి అప్పగించినందుకు సామాజిక వర్గానికి వెనువెంటే ఉంటూ,అది స్థానం సూచనల మేరకు పనిచేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సి డిపార్ట్మెంట్ జిల్లా అధ్యక్షుడు,జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి డా.మహేందర్,మండల కార్యదర్శి నారోజు నరసింహ చారి,వేముల రవి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభం

### కల్వకుర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రంలో బిఏ, బికాం, బిఎస్సీ కోర్సులు.. ఆగస్టు 7 వరకు దరఖాస్తులకు అవకాశం

కల్వకుర్తి రూరల్, ఆగస్టు 04 (మనం న్యూస్) : డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పరిధిలో 2026-27 విద్యా సంవత్సరానికి ఓపెన్ డిగ్రీ కోర్సుల ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైనట్లు కల్వకుర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీపాద శార్వాణి, అధ్యయన కేంద్రం కో-ఆర్డినేటర్ డా. బారోతు రాజు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రంలో బి.ఏ., బి.కాం., బి.ఎస్సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని వారు వెల్లడించారు. ఇంటర్మీడియట్, ఓపెన్ ఇంటర్, డిప్లొమా (10o2), ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ల, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆగస్టు 7వ తేదీతో ముగియనున్నందున ఆసక్తి గల విద్యార్థులు ఆలస్యం చేయకుండా మీ సేవా కేంద్రాలు, నెట్ సెంటర్లు లేదా నేరుగా కల్వకుర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రాన్ని సందర్శించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అడ్మిషన్లకు సంబంధించిన పూర్తి వివరాల కోసం కళాశాల అధ్యయన కేంద్రాన్ని నేరుగా సంప్రదించవచ్చని, అలాగే 73829 29720, 9866058900 నంబర్లలో సంప్రదించి సమాచారం పొందవచ్చని అధ్యయన కేంద్రం కో-ఆర్డినేటర్ డా. బారోతు రాజు తెలిపారు.

# ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలి

### బస్ భవన్ ముట్టడిలో అక్రమ అరెస్టులపై నేతల ఆగ్రహం



వనపర్తి ఆగస్టు 4 (మనం ప్రతినిధి) : ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన రూ.900 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని జిల్లా ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. బస్ భవన్ ముట్టడికి పిలుపునిస్తే వయోవృద్ధులని కూడా చూడకుండా అక్రమ అరెస్టులు చేయడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు వాకిటి శ్రీధర్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సత్యం, కౌన్సిలర్ భారతి ప్రేమ్‌నాథ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 2017 నుంచి రావాల్సిన ఆర్‌బీఎస్, గ్రాట్యుటీ, పెన్షన్ బకాయిలు ఒక్కొక్కరికి 15 నుంచి 20 లక్షల వరకు ఉన్నాయని, పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం దాచుకున్న సొమ్మును ప్రభుత్వం చెల్లించాలని కోరారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని విమర్శించారు. విశ్రాంత ఉద్యోగులను విస్మరిస్తే ప్రభుత్వానికి విశ్రాంతి ఇస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ హయాంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తమకు అండగా నిలిచి సమస్యలు పరిష్కరించారని, నూతన విశ్రాంత భవనం నిర్మించారని గుర్తు చేశారు. అరెస్టు సమయంలో మాజీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్ భారతి ప్రేమ్‌నాథ్ రెడ్డి తమకు మద్దతుగా నిలిచారని కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే తగిన మూల్యం చెల్లించు కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. రామచంద్రారెడ్డి, అంజయ్య, ఉపేందర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# తండాలలో బంజారాల తీజ్ పండుగ

**ప్రపంచవ్యాప్తంగా ఒకే సాంప్రదాయం**

**తీజ్ పండుగకు ప్రభుత్వ గుర్తింపు ప్రకటించాలి**

**బిజెపి సీనియర్ నాయకులు రవి నాయక్**



చారకొండ ఆగస్టు04(మనం న్యూస్) : భారతీయ సంస్కృతిలో ప్రతి పండుగకు ఒక ప్రత్యేకత,విశిష్టత ఉంది.ప్రపంచవ్యాప్తంగా ఒకే భాష, వస్త్రధారణ,ఆభరణాలు,జానపద కళారూపాలు, సంస్కృతి, సంప్రదాయాలు కలిగిన సుమారు 10 కోట్ల మంది బంజారాలు వివిధ ప్రాంతాల్లోలంబాడి, సుగాలి, లంబానీ, బాజీగర్, ధన్కుడి,రోమ్ జిప్సీ తదితర పేర్లతో గుర్తింపు పొందారు.కనుక తీజ్ పండుగకు ప్రభుత్వం అధికారికంగా గుర్తింపు కల్పించాలని బిజెపి సీనియర్ నాయకులు రవి నాయక్ తెలిపారు. కాలానుగుణ పరిస్థితుల ప్రభావంతో సంచార జీవనానికి స్వస్తి పలికి,నేడు దేశంలోని 23 రాష్ట్రాల్లో తండాల పేరుతో స్థిర నివాసాలు ఏర్పరచుకుని జీవనం సాగిస్తున్నారు. వివాహం కాని ఆడపిల్లలు ప్రతి సంవత్సరం తొమ్మిది రోజుల పాటు ఎంతో భక్తిశ్రద్ధలతో,ఆనందోత్సాహాలతో తీజ్ పండుగను నిర్వహిస్తారు."తీజ్" అంటే హరియాలి (పచ్చదనం), నిండుదనం, అష్టైశ్వర్యాలు,శుభం,సౌభాగ్యం,సుభిక్షానికి ప్రతీక అనే అర్థం.

**బంజారా లు సీతలాభవానికి పూజ**

తీజ్ ఉత్సవాలకు శ్రీకారం చుట్టే కార్యక్రమం సీతలాభవాని పూజ. ఈ పూజలను జూలై నెలలో ఒక మంగళవారం నిర్వహిస్తారు. ఆ రోజు తండావాసులు వనభోజనాల పద్ధతిలో తండాకు దూరంగా వెళ్లి, ఒక చెట్టు కింద రాయిని సీతలాభవాని ప్రతిరూపంగా ప్రతిష్ఠించి సంప్రదాయ పూజలు నిర్వహిస్తారు. పంటలు సమృద్ధిగా పండాలని, పశుపక్ష్యాదులు అభివృద్ధి చెందాలని ప్రార్థిస్తారు.అదే రోజు సాయంత్రం తండా నాయకుడి ఇంటి వద్ద ఒక బిందెలో గోధుమలను నానబెడతారు.మరుసటి రోజు వెదురుతో తయారుచేసిన చిన్న కంకణ బుట్టల్లో ఎరువుతో మట్టి వేసి గోధుమలను చల్లుతారు. అలాగే దండి మేరమ్మ మాత, సద్గురు శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్ పేర్లతో టెంకాకు దొప్పల్లో కూడా గోధుమలను నాటి, వాటిని దేరా లేదా పందిరిపై ఉంచుతారు.

**గడ్ గోర్ డామోలి**

తొమ్మిది రోజుల పాటు ప్రతిరోజూ ఆడపడుచులు ఆటపాటలతో సమీపంలోని చెరువు లేదా బావి నుంచి మూడు పర్యాయాలు నీటిని తీసుకొచ్చి కంకణ బుట్టలకు పోస్తూ గోధుమలను పెంచుతారు. ప్రతి సాయంత్రం గోర్ పరివార్ సభ్యులు జానపద గేయాలు, సాంప్రదాయ నృత్యాలు, కళారూపాలు ప్రదర్శిస్తూ తీజ్ ఉత్సవాలను ఆనందోత్సాహాలతో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా బంజారా సంస్కృతి, సంప్రదాయాలు తరతరాలకు అందేలా కృషి చేస్తారు.నిమజ్జనం తొమ్మిదవ రోజు గురువారం ఉదయం దండి మేరమ్మ మాతకు,సద్గురు శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్ కు ప్రత్యేక పూజలు నిర్వహించి కంకణ బుట్టలను పందిరి నుంచి కిందకు దింపుతారు.సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన బంధుమిత్రులు,కుటుంబ సభ్యులు, తండా నాయకులతో కలిసి సంప్రదాయ బంజారా జానపద నృత్యాలు,సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తారు. సాయంత్రం పచ్చగా పెరిగిన గోధుమ నారుతో కూడిన తీజ్ కంకణ బుట్టలను తలపై ధరించి ఆటపాటలతో ఊరేగింపుగా చెరువు వరకు తీసుకెళ్లి సంప్రదాయ బద్ధంగా నిమజ్జనం చేస్తారు.

**తీజ్ పండుగకు అధికార గుర్తింపు కల్పించాలి**

తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో సుమారు 35 లక్షల మంది బంజారాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ విశిష్టమైన తీజ్ పండుగకు ఇప్పటికీ తగిన ప్రభుత్వ గుర్తింపు లభించలేదు.ఆర్థిక ఇబ్బందులు,అవగాహన లోపం వంటి కారణాల వల్ల అనేక తండాలలో ఈ గొప్ప సంప్రదాయం క్రమంగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. కనుక బంజారా సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ప్రకటిస్తున్న తెలంగాణ ప్రభుత్వం తీజ్ పండుగను పరిరక్షించే దిశగా చారిత్రాత్మక నిర్ణయం తీసుకుని,దీనికి అధికారిక గుర్తింపు కల్పించాలని బంజారా సమాజం ఆశాభావంతో ఎదురుచూస్తుంది.





# పెండింగ్ దరఖాస్తుల గుట్టలు..

## అధికారులకు కలెక్టర్ హెచ్చరికలు!

**భూభారతి నుంచి మీసేవ వరకు నెలల తరబడి ప్రజల ఎదురు చూపులు**

**- ఆలస్యాలపై కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆగ్రహం**

మహబూబ్‌నగర్, ఆగస్టు 4(మనం ప్రతినిధి) : జిల్లాలో రెవెన్యూ శాఖ పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులకు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. భూభారతి, సాదాబైనమా, మీసేవ, నక్షా సర్వే, రీసర్వే, ఎస్‌ఐఆర్, ఆర్‌టీఐ తదితర సేవలకు సంబంధించిన వేలాది దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం.

60 రోజులకుపైగా భూభారతి దరఖాస్తులు పరిష్కారం కాకపోవడం, సర్వేయర్ల కొరత, కోర్టు కేసులు, సాంకేతిక సమస్యల పేరుతో ఫైళ్లను నిలిపివేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమీక్షలో వెల్లడైంది. పరిస్థితి ఇంత దారుణంగా మారిన తర్వాతే జిల్లా యంత్రాంగం స్పందించాల్సి రావడం గమనార్హం. సాదాబైనమా దరఖాస్తులు కూడా అనేక మండలాల్లో నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో రైతులు, భూ యజమానులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని సమాచారం. సాంకేతిక కారణాల పేరుతో కేసులు నిలిపివేయడం కాకుండా వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించాల్సి రావడం రెవెన్యూ వ్యవస్థలోని లోపాలను బయటపెడుతోంది.

గ్రామాల రీసర్వే పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయని సమీక్షలో తేలింది. గ్రామ సరిహద్దుల నిర్ధారణ, ప్రభుత్వ భూముల డిమార్కేషన్ వంటి కీలక పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో భూ వివాదాలు కొనసాగుతున్నాయి. పనులు వేగవంతం చేసేందుకు అదనపు లైసెన్స్ సర్వేయర్లను వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మున్సిపాలిటీల్లో నక్షా సర్వే కోసం అవసరమైన పత్రాల సేకరణ కూడా మందగమనంలో ఉండటంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వార్డు అధికారులు, బిల్ కలెక్టర్ల సేవలను పూర్తిగా వినియోగించకపోవడం వల్ల ప్రక్రియ ఆలస్యమవుతోందని ఆక్షేపించారు. మీసేవ కేంద్రాల్లో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ మెంబర్‌షిప్, ఆలస్య జనన నమోదు దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంపై కూడా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అనవసరంగా నిలిపివేయడం లేదా తిరస్కరించడం సహించబోమని హెచ్చరించారు. ఇటీవలే ఎస్‌ఐఆర్ ప్రక్రియపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో, అదే కారణంగా ఇతర రెవెన్యూ సేవలు నిర్లక్ష్యానికి గురికావడం ఆందోళన కలిగిస్తోంది. ఎస్‌ఐఆర్ పనులు కొనసాగుతున్నప్పటికీ భూభారతి తదితర సేవలను నిర్లక్ష్యం చేయరాదని కలెక్టర్ స్పష్టం చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మొత్తంగా చూస్తే, ప్రజలకు సమయానికి సేవలు అందాల్సిన రెవెన్యూ వ్యవస్థలో పెండింగ్ దరఖాస్తుల సమస్య తీవ్రమైన స్థాయికి చేరుకున్న తర్వాతే జిల్లా యంత్రాంగం అప్రమత్తమైనట్లు కనిపిస్తోంది. కలెక్టర్ తాజా ఆదేశాలతోనైనా అధికారులు కదిలి, ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపుతారో లేదో వేచి చూడాల్సి ఉంది.

# అర్ధరాత్రి వర్షంలోనూ పరిమళించిన మానవత్వం

**రక్తహీనతతో కొట్టుమిట్టాడుతున్న గర్భిణీకి ప్రాణదానం**



వనపర్తి ఆగస్టు 4 (మనం ప్రతినిధి) : ప్రాణాపాయంలో ఉన్న ఒక తల్లికి నా రక్తం పనికొస్తుందంటే అంతకుమించిన అదృష్టం ఏముంటుంది" అంటూ అర్ధరాత్రి కురు-స్తున్న వర్షాన్ని కూడా లెక్కచేయకుండా ఆసుపత్రికి పరుగెత్తిన మానవతామూర్తి సాతర్ల రామకృష్ణనే అని చెప్పవచ్చు. శ్రీరంగాపూర్ మండలానికి చెందిన గోవిందమ్మ డెలివరీ కోసం వనపర్తి ప్రభుత్వ ఎంసీహెచ్ ఆసుపత్రికి వచ్చారు. రక్తం తక్కువగా ఉందని ఆర్‌ఎంఓ డాక్టర్ శివప్రసాద్ చెప్పడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. వెంటనే రాష్ట్ర య-ువశక్తి ఫౌండేషన్ అధ్యక్షులు గోబ్బురు నవీన్‌కు ఫోన్ చేయగా, ఆయన దత్తాయిపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే అనుచరుడు సాతర్ల రామకృష్ణకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న రామకృష్ణ రాత్రి 11 గంటలకు వర్షంలో తడుస్తూనే ఆసుపత్రికి చేరుకుని గర్భిణీకి అవసరమైన రక్తాన్ని దానం చేశారు. దీంతో తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారు. "చిన్న సహాయమే అయినా దాని విలువ ఒక ప్రాణం. రామకృష్ణ చూపిన మానవత్వం అందరికీ ఆదర్శం" అని ఆర్‌ఎంఓ డాక్టర్ శివప్రసాద్ కొనియాడారు. సహకరించిన నవీన్‌కు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

# తల్లిపాలే తొలి టీకా..

**తొలి ఆరు నెలలు తల్లిపాలే శిశువుకు జీవరక్షక కవచం**

**అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి**



జడ్చర్ల, ఆగస్టు 4 (మనం ప్రతినిధి ) శిశువు ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పునాది తల్లిపాలేనని, పుట్టిన వెంటనే ఇచ్చే మ-ుర్రుపాలు (కొలొస్ట్రమ్) బిడ్డకు సహజ రోగనిరోధక శక్తిని అందించే తొలి టీకా వంటివని గైరాన్ తాండ అంగన్‌వాడీ టీచర్ ఈ. కృష్ణవేణి పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గైరాన్ తాండ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లుల కోసం నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ, శిశువు జన్మించిన తొలి గంటలోపే తల్లిపాలు పట్టించడం అత్యంత కీలకమని, అదే బిడ్డ ఆరోగ్యానికి బలమైన రక్షణ కవచంగా పనిచేస్తుందని వివరించారు. తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం ద్వారా శిశువుకు అవసరమైన అన్ని పోషకాలు సమృద్ధిగా అందుతాయని, అదనపు ఆహారం లేదా నీటి అవసరం ఉండదని తెలిపారు. తల్లిపాలలో ఉండే పోషకాలు, యాంటీబాడీలు శిశువును విరేచనాలు, శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు, జ్వరాలు వంటి అనేక వ్యాధుల నుంచి రక్షిస్తాయని చెప్పారు. తల్లిపాలు తాగే పిల్లల్లో రోగనిరోధక శక్తి అధికంగా ఉండటంతో పాటు శారీరక, మానసిక ఎదుగుదల కూడా మెరుగ్గా ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం మారుతున్న జీవనశైలి, వాణిజ్య ప్రకటనల ప్రభావంతో కొంతమంది తల్లులు తల్లిపాల ప్రాధాన్యతను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసిన ఆమె, తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, వాటికి ప్రత్యామ్నాయం ఏదీ లేదని స్పష్టం చేశారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లుల ఆరోగ్యం కూడా మెరుగుపడటంతో పాటు ప్రసవానంతర సమస్యలు తగ్గి కుటుంబ నియంత్రణకు కూడా కొంత మేర దోహదపడుతుందని తెలిపారు. ప్రభుత్వం గర్భిణీలు, బాలింతల కోసం అందిస్తున్న పోషకాహార పథకాలు, అంగన్‌వాడీ సేవలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. పిల్లల ఎదుగుదల, బరువు, ఆరోగ్య పరిస్థితులపై తల్లిదండ్రులు నిరంతరం శ్రద్ధ చూపాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిపాల ప్రోత్సాహం అత్యవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళలకు పోషకాహారం, శిశు సంరక్షణ, తల్లిపాల అవసరం, తల్లి-శిశు ఆరోగ్య పరిరక్షణ అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. తల్లులు అడిగిన సందేహాలకు వైద్యపరమైన సూచనలు అందిస్తూ, ప్రతి శిశువుకు తల్లిపాలు అందేలా కుటుంబ సభ్యుల సహకారం కూడా అవసరమని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముజ్జా నాయక్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, మహిళలు, గ్రామ పెద్దలు పి.ఎస్., ఈ. కృష్ణమ్మ, పి. మేఘమాల, ఎస్. సరస్వతి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో అంగన్‌వాడీ సిబ్బంది మరియు మహిళలు కలిసి "తల్లిపాలే బిడ్డకు అమృతం... తొలి ఆరు నెలలు తల్లిపాలే శిశు ఆరోగ్యానికి అజేయ రక్షణ కవచం" అనే సందేశాన్ని గ్రామ ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రతిజ్ఞ చేశారు.

# ఆగస్టు 7న జోగులాంబ గద్వాలలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు

**చేనేత వస్త్రాల వినియోగంతో చేనేత కార్మికులకు అండగా నిలుద్దాం**

ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 04 (మనం బ్యూరో) : జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా 2026 ఆగస్టు 7వ. తేదీ శుక్రవారం ఉదయం 10.00 గంటలకు జోగులాంబ గద్వాల పట్టణంలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు సహాయ సంచాలకులు, చేనేత, జౌళి శాఖ ఇందిర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఆవిష్కరించి చేనేత నడకను ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా చేనేత వస్త్రాల వినియోగం,చేనేత కళల పరిరక్షణ, చేనేత వారసత్వ సంపదను భావితరాలకు అందించాల్సిన అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. చేనేత వస్త్రాల కొనుగోలు, వినియోగం ద్వారా చేనేత కార్మికులకు ప్రత్యక్షంగా ఉపాధి లభిస్తుందన్నారు. సహజ నారతో తయారయ్యే చేనేత వస్త్రాలు చర్మానికి మేలు చేయడమే కాకుండా ఆరోగ్య రక్షణతో పాటు హుందాతనాన్ని ప్రతిబింబిస్తాయని ప్రజలు విస్తృతంగా చేనేత వస్త్రాలను వినియోగించాలని పిలుపునిచ్చారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలల్లో "తెలంగాణ రాష్ట్రంలో చేనేత రంగం -- భవిష్యత్ అవకాశాలు"అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం తదితర పోటీలలో విజేతలైన విద్యార్థులకు ఈ కార్యక్రమంలో ప్రమ-ుఖుల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు. కావున, జోగులాంబ గద్వాల జిల్లాలోని అన్ని చేనేత, ఉన్ని, సిల్క్ సహకార సంఘాల అధ్యక్షులు, చేనేత కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సహాయ సంచాలకులు ఇందిర ఒక ప్రకటనలో కోరారు.

# జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ

**పరిశుభ్రత, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి**

**పాఠశాల యాజమాన్యం ఘన సన్మానం**



మహబూబ్ నగర్ ఆగస్టు 4 (మనం ప్రతినిధి ) బాదేపల్లిలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలను మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎం. గిరీష్ కుమార్ ఆకస్మికంగా సందర్శించి పాఠశాల పరిసరాలను సమగ్రంగా పరిశీలించారు. లోకల్ బాడీ కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ తనిఖీలో పాఠశాల పరిశుభ్రత, మౌలిక వసతులు, పారిశుద్ధ్య పరిస్థితులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించారు. పాఠశాల ఆవరణలోని తరగతి గదులు, తాగునీటి సదుపాయాలు, మరుగుదొడ్లు, క్రీడా మైదానం తదితర అంశాలను కమిషనర్ పరిశీలించి, పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచనలు చేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం తరఫున మున్సిపల్ కమిషనర్ గిరీష్ కుమార్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ అధికారులు విద్యాసంస్థల అభివృద్ధిపై చూపుతున్న శ్రద్ధ అభినందనీయమని పాఠశాల ప్రతినిధులు పేర్కొన్నారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యా యుడు తిమ్మయ్య, సునీల్ కుమార్, టపాస్ (స్టేట్ సెక్రటరీ), యుగేందర్ (టీజీఏ గౌరవ రాష్ట్ర అధ్యక్షుడు), శంకర్ బాబు, ఫిజికల్ డైరెక్టర్ ఆర్.కె., ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అచ్చంపేట కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా రాజగోపాల్

**నియామక పత్రం అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ**



అచ్చంపేట, ఆగస్టు 4 (మనం న్యూస్) : నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట తాలూకా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా చింతల రాజగోపాల్‌ను నియమించారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ చేతుల మీదుగా ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. అచ్చంపేట తాలూకా పరిధిలోని అన్ని మండలాలకు కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నూతన అధ్యక్షులను నియమించిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు వంకేశ్వరం నిరంజన్ కూడా పాల్గొని నూతన బాధ్యులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు ఎస్సీ సెల్ నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంతో పాటు ఎస్సీ వర్గాల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు వంకేశ్వరం నిరంజన్ మాట్లాడుతూ, నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాయకులు పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు సామాజిక న్యాయం, సమానత్వం కోసం కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చింతల రాజగోపాల్ మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, అచ్చంపేట తాలూకాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ఎస్సీ వర్గాల సంక్షేమానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎస్సీ సెల్ ప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని నూతన అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ముదిరాజ్ మేయర్ గుమ్మాల మమత పై వివక్ష

**కాంగ్రెస్‌కు ముదిరాజ్ మహాసభ వార్నింగ్**



మహబూబ్‌నగర్, 04 ఆగస్టు (మనం న్యూస్) : ముదిరాజ్‌పై ముదిరాజ్ ఆడబిడ్డ, మహబూబ్‌నగర్ మేయర్ గుమ్మల్ మమత పై కాంగ్రెస్ పార్టీలోని కొందరు నాయకులు ఉద్దేశపూర్వకంగా వివక్ష చూపుతున్నారని ముదిరాజ్ మహాసభ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు మెట్టుకాడి ప్రభాకర్ తీవ్రంగా హెచ్చరించారు. మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. కార్పొరేషన్ మీటింగ్‌లో మేయర్‌కు కేటాయించాల్సిన సీటు కేటాయించడం లేదనీ ఆమెకు కారు అలవెన్స్ ఇవ్వడం లేదన్నారు. కార్యాలయ పునరుద్ధరణ విషయంలో కూడా నిధుల కేటాయింపులో వివక్ష చూపించారు. ప్రోటోకాల్ పాటించకుండా మేయర్ హోదాను కించపరుస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్నత వర్గాల నాయకులు మేయర్ గుమ్మల్ మమతను ఉద్దేశపూర్వకంగా కించపరుస్తున్నారని తెలిపారు . ఈ విషయం లో ముదిరాజ్ సంఘం చాలా సీరియస్‌గా గమనిస్తోందని ఆయన అన్నారు. గత అనుభవాలను గుర్తుచేస్తూ మెట్టుకాడి ప్రభాకర్ మరింత ఘాటుగా స్పందించారు. గతంలో మాజీ మంత్రి ఒకరు ముదిరాజులను దూషించి, చిన్నచూపు చూశారు. అప్పుడు ముదిరాజుల సత్తా ఏమిటో చూపించి ఆయనను ఓడగొట్టాం. కాంగ్రెస్ కూడా అదే గతికి వెళ్తుంది. ముదిరాజులతో పెట్టుకుంటే ఏమవుతుందో గుర్తించుకోవాలి అని హెచ్చరించారు. మేయర్ మమత మా ఆడబిడ్డ ఆమెకు జరిగే అవమానం మొత్తం ముదిరాజ్ జాతికే జరిగినట్టేనని అన్నారు. ఇప్పటికైనా వివక్ష ఆపి, మేయర్‌కు సముచిత గౌరవం, ప్రోటోకాల్ ఇవ్వాలి. లేకపోతే సరైన సమయంలో సరైన బుద్ధి చెప్పేందుకు ముదిరాజ్ సంఘం వెనుకాడదని మెట్టుకాడి ప్రభాకర్ తేల్చి చెప్పారు. ముదిరాజ్ మహాసభ డిమాండ్లు ఇవే.. మేయర్‌కు కార్పొరేషన్‌లో ప్రోటోకాల్ ప్రకారం సీటు కేటాయింపు కారు అలవెన్స్ వెంటనే విడుదల, కార్యాలయ పునరుద్ధరణకు నిధులు కేటాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. షార్ట్ వర్షన్ సోషల్ మీడియా కోసం ముదిరాజ్ ఆడబిడ్డ, మహబూబ్‌నగర్ మేయర్ గుమ్మల్ మమతకు కాంగ్రెస్‌లో వివక్ష ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తుందని ఆరోపించారు. ముదిరాజులతో పెట్టుకుంటే గతంలో ఏమైందో గుర్తు తెచ్చుకోవాలన్నారు.



# బాదేపల్లిలో హరితహారం జోరు

గాంధీనగర్--కేకే నగర్ కాలనీల్లో భారీగా మొక్కల నాటింపు

మహబూబ్ నగర్, ఆగస్టు 4 (మనం ప్రతినిధి) : పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా బాదేపల్లి జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు గాంధీనగర్, కేకే నగర్ కాలనీలలో మంగళవారం విస్తృత స్థాయిలో మొక్కల నాటకం చేపట్టారు. మున్సిపల్ స్థలంలో స్థానిక నాయకుడు ఎంబీ బాలకృష్ణ చొరవతో, మున్సిపల్ కమిషనర్ ఎం. గిరీష్ ప్రత్యేక శ్రద్ధతో ఈ హరిత కార్యక్రమం నిర్వహించడం విశేషం. కాలనీల పరిసరాలను మరింత పచ్చదనంతో నింపాలనే లక్ష్యంతో వివిధ రకాల నీడనిచ్చే, పర్యావరణానికి మేలు చేసే మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది కొండయ్య, ప్రవీణ్, చెన్నకేశవులు తదితరులు పాల్గొని మొక్కల నాటకాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ, పచ్చదనాన్ని పెంపొందించేందుకు మున్సిపాలిటీ అధికారులు తీసుకున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రమైన వాతావరణం కోసం ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. మొక్కల నాటకం చేపట్టిన కమిషనర్ గిరీష్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ అశోక్ కుమార్‌తో పాటు మున్సిపల్ సిబ్బందికి స్థానికులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంబీ బాలకృష్ణ, శివయ్య, వరప్రసాద్, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, కృష్ణ, నరసింహ, యాదయ్య, మహేందర్ తదితర కాలనీవాసులు పాల్గొని హరితహార కార్యక్రమానికి మద్దతు తెలిపారు. "పచ్చదనం పెరిగితేనే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందుతుంది" అనే సందేశంతో నిర్వహించిన ఈ మొక్కల నాటకం స్థానిక ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై మరింత చైతన్యాన్ని కలిగించింది.

# నాలుగు లేబర్ కోడ్‌ల రద్దే లక్ష్యం

**ఆగస్టు 10 జైలు భరోకు కార్మికులు**

**రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలి: రైతు సంఘం**

అచ్చంపేట, ఆగస్టు 4 (మనం న్యూస్) : దేశంలో కార్మిక వర్గం ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను పరిరక్షించేందుకు, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలనే డిమాండ్‌తో ఆగస్టు 10న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సైదులు పిలుపునిచ్చారు. మంగళవారం అచ్చంపేట మండలంలోని సిద్ధాపూర్ గ్రామ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా కార్యకర్తలకు కరపత్రాలు పంపిణీ చేసి, కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించే ఈ జైలు భరో కార్యక్రమంలో కార్మికులు, రైతులు, ఆశా కార్యకర్తలు, వ్యవసాయ కూలీలు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ హక్కుల కోసం గొంతెత్తాలని కోరారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ, కార్మికులకు రక్షణగా ఉన్న చట్టాలను బలహీనపరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ కోడ్‌లు అమల్లోకి వస్తే కార్మికుల ఉద్యోగ భద్రత, వేతన హక్కులు, సంక్షేమ సౌకర్యాలు, ట్రేడ్ యూనియన్ హక్కులు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులు, రైతులు, ప్రజల ప్రయోజనాలను దెబ్బతీసే విధానాలను వ్యతిరేకిస్తూ ఐక్యంగా పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం జరిగే జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేసి కేంద్ర ప్రభుత్వానికి గట్టి సందేశం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలకు కరపత్రాలు పంపిణీ చేసి, కార్యక్రమం ఉద్దేశ్యాన్ని వివరించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం రైతు సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న ఉద్యమాలకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, ఆశా కార్యకర్తలు, కార్మికులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# పబ్బతి ఆంజనేయస్వామి సన్నిధిలో కలెక్టర్ హేమంత్ పూజలు



అచ్చంపేట, ఆగస్టు 4 (మనం న్యూస్) : నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని పదర మండలం మద్దిమడుగు గ్రామంలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీశ్రీశ్రీ పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయానికి చేరుకున్న జిల్లా కలెక్టర్‌కు ప్రధాన అర్చకులు వీరయ్య పూర్ణకుంభంతో, వేదమంత్రోచ్ఛారణల మధ్య సాంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. వేద పండితులు వేదాశీర్వచనాలతో జిల్లా కలెక్టర్‌ను ఆశీర్వదించి శేషవస్త్రంతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని, రైతులకు సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, యువత విద్య, ఉపాధి రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని, నాగర్‌కర్నూలు జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని జిల్లా కలెక్టర్ స్వామివారిని ప్రార్థించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు వీరయ్య, పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయ చరిత్ర, ఆధ్యాత్మిక విశిష్టత, ఆలయ పురాతన వైభవం, నిత్య పూజా కార్యక్రమాలు, వార్షిక బ్రహ్మోత్సవాల ప్రాముఖ్యత గురించి కలెక్టర్‌కు వివరించారు. ఈ క్షేత్రం తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది భక్తులను ఆకర్షిస్తోందని, స్వామివారిని దర్శించుకుంటే భక్తుల కోరికలు నెరవేరుతాయని విశ్వాసం ఉందని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి భక్తులకు అందుతున్న తాగునీరు, పరిశుభ్రత, పార్కింగ్, క్యూ లైన్లు, ఇతర మౌలిక వసతులపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలని, పరిశుభ్రతను ఎల్లప్పుడూ పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆలయ పరిసరాల్లో పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఒక మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి రేవంత్ చంద్ర, ఎంపీడీవో సుధాకర్, స్థానిక ఎస్సై, వివిధ శాఖల అధికారులు, ఆలయ అర్చకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ పర్యటనతో ఆలయానికి విచ్చేసిన భక్తులు ఆనందం వ్యక్తం చేస్తూ, దేవస్థాన అభివృద్ధికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.



# చిన్నారుల భద్రత, సంక్షేమమే లక్ష్యం



ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 04 (మనం బ్యూరో) : జాతీయ న్యాయ సేవా సంస్థ (చీూూూూ) అమలు చేస్తున్న చిన్నారుల సంక్షేమం, రక్షణకు సంబంధించిన పథకాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో జిల్లా న్యాయ సేవా సంస్థ, జోగులాంబ గద్వాల ఆధ్వర్యంలో మంగళవారం గ్రామా కొండాపూర్, కేటీదొడ్డి మండలంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ బి. శ్రీనివాసులు, జిల్లా సంక్షేమ అధికారి సునంద లు ముఖ్య వక్తలుగా పాల్గొన్నారు. వారు చిన్నారులకు చట్టం కల్పించిన హక్కులు, నల్సా ద్వారా అందించే ఉచిత న్యాయ సహాయం, పోక్సో చట్టం--2012 (గూజూూ ూూ్), బాల్య వివాహాల నిషేధ చట్టం--2006, బాల కార్మిక (నిషేధం, నియంత్రణ) చట్టం, విద్యా హక్కు చట్టం--2009, జువెనైల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ, రక్షణ) చట్టం--2015, సైబర్ భద్రతతో పాటు చిన్నారుల రక్షణకు సంబంధించిన ఇతర చట్టాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చిన్నారులు ఎలాంటి వేధింపులు, దుర్వినియోగం లేదా హింసకు గురైన వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలను వినియోగించాలన్నారు. అలాగే ఉచిత న్యాయ సహాయం అవసరమైన ప్రతి ఒక్కరూ జాతీయ న్యాయ సేవా సంస్థ టోల్ ఫ్రీ నంబర్ -- 15100కు కాల్ చేసి న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. ప్రతి చిన్నారికి సురక్షితమైన వాతావరణంలో జీవించే హక్కు, విద్యను అభ్యసించే హక్కు, హింస, దుర్వినియోగం నుండి రక్షణ పొందే హక్కును భారత రాజ్యాంగం, వివిధ బాలల సంక్షేమ చట్టాలు కల్పించాయని వివరించారు. విద్యార్థులు సోషల్ మీడియా, ఇంటర్నెట్‌ను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి నరసింహ, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ జి. రఘు రామి రెడ్డి, సీడబ్ల్యూసీ కౌన్సిలర్ సురేష్, చైల్డ్‌లైన్ విభాగం ప్రతినిధి నవీన్, ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధి హనిమిరెడ్డి, భరోసా కేంద్రం ప్రతినిధి శ్వేత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సైబర్ జాగృక్తా దివస్

## జిల్లా వ్యాప్తంగా సైబర్ అవగాహన కార్యక్రమాలు : ఎస్పీ డి.జానకి



మహబూబ్ నగర్, 04ఆగస్టు, (మనం న్యూస్) : కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే సైబర్ జాగృక్తా దివస్ కార్యక్రమంలో భాగంగా, మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజలకు సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ డి.జానకి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలు, మార్కెట్ ప్రాంతాలు, వ్యాపార సంస్థలు, బ్యాంకులు, ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రదేశాల్లో పోలీసు అధికారులు, సిబ్బంది సైబర్ భద్రతపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వీడియో కాల్స్, సందేశాలు, లింకులు, ఓటీపీ లు, బ్యాంకు ఖాతా వివరాలు లేదా ఇతర వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దు. సోషల్ మీడియాలో వచ్చే నకిలీ ప్రకటనలు, పెట్టుబడి ఆఫర్లు, ఆన్‌లైన్ ట్రేడింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, డిజిటల్ అరెస్ట్, కస్టమర్ కేర్ పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా, అధికారిక వెబ్‌సైట్లు మరియు అధికారిక మొబైల్ యాప్‌లను మాత్రమే వినియోగించాలి. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడం లేదా ఒఒఒ.ఎఎఎవతీఎతీఅఎవ.స్త్రశీజ.అఅ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయడం ద్వారా త్వరితగతిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. బలమైన పాస్‌వర్డ్‌లు ఉపయోగించడం, రెండు దశల భద్రత ను తప్పనిసరిగా వినియోగించడం ద్వారా వ్యక్తిగత డిజిటల్ ఖాతాలను మరింత భద్రపరచుకోవాలని సూచించారు. సైబర్ నేరాల నివారణలో ప్రజల అప్రమత్తతే అత్యంత ప్రభావవంతమైన ఆయుధమని, ప్రతి ఒక్కరూ డిజిటల్ లావాదేవీలు నిర్వహించే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించడంతో పాటు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ డి.జానకి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, సైబర్ జాగృక్తా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని, సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించడం ద్వారా సురక్షితమైన డిజిటల్ సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా ఎస్పీ కోరారు.

# అమెరికాలో ఉన్నా.. జడ్చర్ల ప్రజలపైనే ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి దృష్టి!



మహబూబ్ నగర్, ఆగస్టు 4(మనం ప్రతినిధి) : జడ్చర్ల నియోజకవర్గ ప్రజల సంక్షేమమే తన రాజకీయ జీవిత లక్ష్యమని నిరూపించుకుంటున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి మరోసారి ప్రజల మనసులు గెలుచుకున్నారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్నప్పటికీ, నియోజకవర్గంలో కురుస్తున్న వర్షాలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తూ అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. “జనంపల్లి” అనే ఇంటి పేరులోనే “జనం” ఉన్నట్లుగా, ప్రజల సమస్యలే తన సమస్యలుగా భావించే నాయకుడిగా ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి గుర్తింపు పొందారు. జడ్చర్ల నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక ముద్ర వేసుకున్న ఆయన, విదేశాల్లో ఉన్నప్పటికీ తన నియోజకవర్గాన్ని మరవలేదని ఈ చర్యలు స్పష్టం చేస్తున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించినట్లు సమాచారం. వర్షపు నీరు నిలిచిపోయిన ప్రాంతాలు, లోతట్టు కాలనీలు, చెరువులు, వాగులు, ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించినట్లు తెలుస్తోంది. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఉండి ప్రజలకు అండగా నిలవాలని, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించాలని ఎమ్మెల్యే కోరినట్లు సమాచారం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆయన సూచించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. విదేశీ పర్యటనలో ఉన్నప్పటికీ నియోజకవర్గ పరిస్థితులపై నిరంతరం ఆరా తీస్తూ, ప్రజల భద్రతకే ప్రాధాన్యం ఇస్తున్న ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి తీరుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా, ఆపద సమయంలో అండగా నిలిచే ప్రజానేతగా ఆయన మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



## వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఆదేశాలకు విలువే లేదా?

### కార్మిక వ్యతిరేక విధానాలు నిరసిస్తూ 10న కార్మిక జైలు భరో

**పి.సురేష్ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి**

మహబూబ్ నగర్, 04 ఆగస్టు, (మనం న్యూస్) : ప్రభుత్వ వైద్యరంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఒకటో తేదీ నాడే కచ్చితంగా వేతనాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు, ఏజెన్సీ కాంట్రాక్టర్లకు గత నెల తొమ్మిదో తేదీన తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మాత్యులు దామోదర రాజనర్సింహ స్పష్టమైన లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేసిన రాష్ట్రంలో వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఏ ఒక్క కాంట్రాక్టు కార్మికులకు వేతనం అందలేదని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఆదేశాలు అధికారులకు సంబంధిత ఏజెన్సీ కాంట్రాక్టర్లకు విలువ లేదా అని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ ప్రశ్నించారు. మంగళవారం మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, రైతు, వ్యవసాయ కూలీ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కనీస వేతనం 26 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న దేశవ్యాప్తంగా వామపక్ష కార్మిక సంఘాల నేతృత్వంలో జైల్ భరో కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ లు తీసుకువచ్చిందని ఆరోపించారు. నూతన లేబర్ కోడ్స్ కార్మిక సంక్షేమ రాజ్యానికి మరణ శాసనాలుగా మారాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల లేబర్ కోడ్స్ రాష్ట్రంలో అమలుకాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఒకటో తారీకు నాడు వేతనాల చెల్లింపులో నిర్లక్ష్యంపై పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి బ్రాంచ్ యూనియన్ అధ్యక్షులు రంగన్న, సీనియర్ నాయకులు బి.చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి దేవానంద్, నాయకులు ఎస్.పద్మ, లక్ష్మమ్మ, రజియా,నైసన్, అంజలయ్య, యాదయ్య,శంకర్, శేఖర్,తదితరులు పాల్గొన్నారు.



## తల్లి పాలు పిల్లల ఆరోగ్యానికి ఎంతో మేలు

జాజిరెడ్డిగూడెం, ఆగస్టు 04(మనం న్యూస్) : తల్లి పాలు పిల్లలు ఆరోగ్యంగా పెరగడానికి దోహదం చేస్తాయని గ్రామ సర్పంచ్ కర్నాటి వెంకన్న అన్నారు. మంగళవారం మండలంలోని రామన్నగూడెం అంగన్వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. ప్రతి తల్లి పిల్లలకు ముర్రు పాలు పట్టించాలని సూచించారు. ముర్రు పాలు పట్టించడం ద్వారా 300 రకాల జబ్బులు రాకుండా పిల్లలను కాపాడవచ్చని తెలిపారు. అంగన్వాడీ కేంద్రం ద్వారా అందించే పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం నీరజ, సీహెచ్ఓ బిచ్చునాయక్, అంగన్వాడీ టీచర్ పుష్పలత, ఏఎన్ఎంలు జ్యోతి, గిరిజ, వార్డు సభ్యులు ముధావత్ తనేష్, స్రవంతి, ఆశా కార్యకర్త శైలజ, యామిని, తదితరులు పాల్గొన్నారు.

## జూరాల ప్రాజెక్టుతో పూర్తిస్థాయిలో
# ఆయకట్టుకు సాగునీరు

**వరద నీటిని సద్వినియోగం చేసుకోవాలి**

**జూరాల కుడి కాలువ ద్వారా ఆర్డీఎస్ లింక్ కెనాల్స్ కు నీటిని మళ్ళించాలి**

**వేసవిలో తాగునీటి కొరత లేకుండా ప్రణాళిక అవసరం**

**కాలువలు, ఇతర మరమ్మత్తుల పనులు వేసవిలోనే పూర్తి చేయాలి**

**జూరాల ప్రాజెక్టును సందర్శించిన కలెక్టర్**

**జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 04 (మనం బ్యూరో) : జూరాల ప్రాజెక్టు పరిధిలో చేపట్టిన జిల్లాలోని వివిధ ఎత్తిపోతల పథకాలతో ప్రస్తుతం వస్తున్న వరద నీటితో అన్ని రిజర్వాయర్లను నింపుకోవడంతో పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీటిని అందించవచ్చని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం ధరూర్ మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టును జోగులాంబ జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మ్యాపును, వివిధ రిజిస్టర్ లను పరిశీలించారు. కర్ణాటక ప్రాజెక్టుల నుంచి కొద్దిరోజులుగా కృష్ణా నదికి పెద్ద ఎత్తున వరద వస్తుండడంతో జూరాల ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి సామ–ర్థ్యం, గేట్ల ద్వారా దిగువకు వదులుతున్న, ఎత్తిపోతల పథకాలకు, సమాంతర కాలువలకు వినియోగిస్తున్న వరద నీటి, తదితర వివరాలను సంబంధిత ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ గేట్లను పరిశీలించిన కలెక్టర్ అక్కడి యంత్రాల పనితీరుపై క్షుణ్ణంగా తెలుసుకున్నారు. అదేవిధంగా పనిచేస్తున్న సిబ్బంది వివరాలను అడిగారు. పవర్ హౌస్ నుంచి ఉత్పత్తి అయ్యే జలవిద్యుత్ గురించి అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జూరాల కుడి కాలువ లైనింగ్ మరమ్మత్తులు, ఇతర పనులను వేసవిలోనే పూర్తి చేయాలన్నారు. చివరి ఆయకట్టుకు కూడా సాగునీరు అందాలంటే కాలువల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు ప్రాజెక్టుల నిర్వహణకు వచ్చే నిధులను ఎప్పటికప్పుడు సద్వినియోగం చేసుకుంటే ఎలాంటి సమస్య ఉండదన్నారు. జూరాల కుడికాలువ ద్వారా ఆర్డీఎస్ పరిధిలోని లింక్ కెనాల్సు కు నీటిని మళ్లించేందుకు ప్రయత్నించాలన్నారు. ఫలితంగా అలంపూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురు–స్తున్నందున రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నప్పటికీ కాలువల పరిధిలోని రైతులు ప్రస్తుతం నీటిని విడుదల చేస్తుండడంతో వరి సాగు చేసే అవకాశం ఉందన్నారు. వరి పండించే రైతుల పంటలు చేతికొచ్చే వరకు కాలువల ద్వారా వరి సాగుకు నీటి లభ్యత గురించి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. గద్వాల నియోజకవర్గ పరిధిలోని గూడెం దొడ్డి, ర్యాలంపాడు, తదితర రిజర్వాయర్లను ప్రస్తుతం వస్తున్న వరద నీటితో పూర్తి స్థాయిలో నింపుకోవాలని సూచించారు. వేసవిలో తాగునీటి సమస్యలు ఉత్పన్నం అవ్వకుండా ప్రణాళికతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. జూరాల గేట్లు తెరవడంతో సెలవు రోజుల్లో పెద్ద ఎత్తున పర్యాటకులు వస్తున్నందున వంతెనపై ట్రాఫిక్ జామ్ సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. సందర్శకులు ఘాట్ల వద్ద నీళ్లలోకి దిగకుండా రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇరిగేషన్ రహదారుల అభివృద్ధికి ఆర్ అండ్ బి ఆధ్వర్యంలో మరమ్మత్తులు చేయించేందుకు ఇటీవల జిల్లాలో పర్యటించిన రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించినందున సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న వివిధ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ వేగవంతం చేయాలన్నారు. ఆర్ అండ్ ఆర్ కేంద్రాల్లో నివసిస్తున్న ప్రజలకు పూర్తిస్థాయిలో సదుపాయాలను కల్పించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో నీటిపారుదల శాఖ ఎస్ఈ కేశవరావు, డిఈ నాగేశ్వరరావు, తహసిల్దార్ నందిని, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## విద్యా వాలంటీర్ల శిక్షణ శిబిరానికి డీఈఓకు ఆహ్వానం

మహబూబ్ నగర్, 04ఆగస్టు, (మనం న్యూస్) : మహబూబ్ నగర్ జిల్లా విద్యాశాఖ అధికారి విజయ కుమారి ని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, ఈ నెల 8, 9, 10 తేదీలలో మహబూబ్ నగర్ ఫస్ట్ శిక్షణ కేంద్రంలో నిర్వహించనున్న విద్యా వాలంటీర్ల శిక్షణ కార్యక్రమానికి ఆహ్వానించారు. మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తన సొంత నిధులతో విద్యా రంగ అభివృద్ధికి కట్టుబడి చేపట్టిన 'శతశాతం' కార్యక్రమం ప్రస్తుతం మహబూబ్ నగర్ నియోజకవర్గంలో విశేష ఫలితాలను అందిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో, ప్రత్యేక పరీక్ష ద్వారా ప్రతిభావంతులైన విద్యా వాలంటీర్లను ఎంపిక చేయడం జరిగింది. ఈ వాలంటీర్లకు బోధనా నైపుణ్యాలు, విద్యార్థులతో మెలగే విధానం, పాఠ్యాంశాల లోతైన అవగాహన వంటి అంశాల్లో శిక్షణ ఇవ్వడం కోసం ఈ మూడు రోజుల శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో నిష్ణాతులైన అధ్యాపకుల బృందం పాల్గొని, ఆధునిక బోధనా పద్ధతులు, డిజిటల్ టూల్స్ వినియోగం, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, పరీక్షల సిద్ధత వంటి కీలక అంశాలపై సమగ్ర మార్గదర్శకత్వం అందించనున్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ప్రతిభను వెలికితీసి, వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే ప్రధాన ఉద్దేశంగా నిర్వాహకులు తెలిపారు. ఈ నేపథ్యంలో, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి, విద్యా వాలంటీర్లకు ప్రోత్సాహం ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారి ని ఆహ్వానించారు. ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, వందేమాతరం ఫౌండేషన్ కోఆర్డినేటర్ టి. రవీందర్ రెడ్డి, జీహెచ్ఎంలు బాలు యాదవ్, ఆనంతప్ప, హెచ్ఎం హరినాథ్, రాజు నాయక్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# సదరం భవనం ఆగస్టు 15 నాటికి ప్రారంభానికి సిద్ధం చేయాలి

**సదరశీ ధృవపత్రాలు త్వరితగతిన జారీ చేయాలి**

**ప్రభుత్వ దావఖానలో మౌలిక వసతులు, వైద్య సేవలు మరింత మెరుగు పరచాలి**

**జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 04 (మనం బ్యూరో) : జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతులు, వైద్య సేవలను మరింత మెరుగు పరిచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు, సదరం, మౌలిక వసతులు తదితర అంశాలపై కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రజలకు నాణ్యమైన, వేగవంతమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఆసుపత్రిలో వైద్య పరికరాలు, మందులు, వైద్యులు సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఉన్న లోటు పాట్లను సమగ్రంగా గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలన్నారు. జిల్లా ఆసుపత్రిలో నిర్మాణంలో ఉన్న సదరం భవనాన్ని ఆగస్టు 15 నాటికి ప్రారంభించేందుకు అవసరమైన అన్ని సివిల్ పనులను పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి నాణ్యతా ప్రమాణాలతో అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సదరం సర్టిఫికెట్ల జారీ ప్రక్రియలో పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి కొత్త సామాజిక భద్రతా పెన్షన్ల మంజూరు దృష్ట్యా, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సకాలంలో సదరం ధ్రువపత్రాలు జారీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నకిలీ సర్టిఫికెట్లు జారీ కాకుండా పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలన్నారు. సదరం కేంద్రంలో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు. సదరం కేంద్రం నిర్వహణ కోసం అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్‌తో పాటు ఒక సీసీని నియమించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఓ అధికారులను ఆదేశించారు. ప్రోగ్రాం అధికారులు సందర్శించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించిన తనిఖీ నివేదికలను సమర్పించాలని డీఎంహెచ్‌ఓ ను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి సేవల ప్రమాణాలను మరింత మెరుగుపర్చాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, డిఆర్డిఓ ముషాయిదా బేగం, డి.ఎం.హెచ్.ఓ సంధ్య కిరణ్మయి, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఝాన్సీ, పంచాయతీరాజ్ శాఖ ఈఈ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్‌లో కాంగ్రెస్ నాయకులు భాగస్వామ్యం

**ఎస్ఐఆర్ కార్యక్రమం వేగమంతం చేయాలి**

**కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు రహీం**

(అమ్రాబాద్) ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు న04 (మనం బ్యూరో) : అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామంలో మంగళవారం ఎస్ ఐ ఆర్ కార్యక్రమాలు ముమ్మరంగా ఎందుకు సాగేందుకు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు రహీం, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో బి ఎల్ ఓ లతో ఎస్ ఐ ఆర్ కార్యక్రమం ఎంతవరకు వచ్చిందంటూ ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుంటున్నారు. గ్రామాల్లో చనిపోయిన వారి లిస్టు మైగ్రేడ్ అయిన వారి లిస్ట్ అలగే డబల్ డబల్ ఉన్న వారి పరిశీలిస్తూ గ్రామంలో ఉన్న ప్రజలకు న్యాయం జరగాలని ప్రతి లిస్టును క్షేమంగా పరిశీలిస్తున్నారు. మళ్లీ ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని కొంతవరకు ప్రభుత్వం గడువు పొడిగించడం పట్ల ప్రజలు మేలు జరుగుతుందన్నారు. ఎన్నిమరేషన్ ఫామ్స్ ప్రతి ఒక్కరూ స్వయంగా తీసుకొని ఇచ్చిన దరఖాస్తును పూర్తి చేసి ఇవ్వని కోరుతున్నారు. స్వయంగా ప్రతి ఇంటికి వెళ్లి పూర్తి చేస్తున్నామని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రహీం తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మంజుల రాజారాం నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శంభు వెంకటరమణ, జూలూరి సత్యనారాయణ, పెర్మల బాలస్వామి, కృష్ణ నాయక్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఏళ్ల తరబడి సేవలు.. చివరికి ఉద్యోగాల తొలగింపేనా?

**భూ భారతి ఆపరేటర్ల ఆవేదన**

**ధరణి కోసం చెమటోడ్చాం**

**ఇప్పుడు మమ్మల్ని రోడ్డున పడేస్తారా?"**

**అంటూ మంత్రిని ఆశ్రయించిన ఆపరేటర్లు**



మహబూబ్ నగర్, ఆగస్టు 4 (మనం ప్రతినిధి)రెవెన్యూ శాఖలో భూ రికార్డుల నిర్వహణకు వెన్నెముకలా పనిచేస్తూ, ధరణి పోర్టల్ ప్రారంభమైన నాటి నుంచి ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరవేస్తున్న భూ భారతి ఆపరేటర్ల భవిష్యత్తు నేడు ప్రశ్నార్థకంగా మారింది. ఏడు సంవత్సరాలుగా రెవెన్యూ వ్యవస్థకు అండగా నిలిచిన తమను ఒక్కసారిగా విధుల నుంచి తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ తెలంగాణ రాష్ట్ర భూ భారతి ఆపరేటర్లు కన్నీటి పర్యంతమయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించిన ఆపరేటర్లు, తమ గోడును వివరించారు. తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో భూ రికార్డుల నిర్వహణ, రైతుల దరఖాస్తుల పరిశీలన, సాంకేతిక సహకారం, భూ సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తూ ప్రభుత్వ వ్యవస్థలో అంతర్భాగంగా మారిన తమను ఇప్పుడు పక్కన పెట్టడం తీవ్ర అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి పోర్టల్‌లో చోటుచేసుకున్న అవకతవకలతో తమకు ఎలాంటి సంబంధం లేకపోయినా, వాటి బాధ్యతను తమపై మోపే ప్రయత్నాలు జరుగుతున్నాయని వారు ఆరోపించారు. ఇదే సమయంలో అనుభవజ్ఞులైన ఆపరేటర్లను తొలగించి, వారి స్థానాల్లో జూనియర్ అసిస్టెంట్లను నియమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే వార్తలు తమను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. "ప్రభుత్వంపై నమ్మకంతో, ప్రజల కోసం పగలు-రాత్రి తేడా లేకుండా పనిచేశాం. రైతుల సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల్లోనే కాదు, క్షేత్రస్థాయిలోనూ సేవలందించాం. ఇప్పుడు మమ్మల్ని ఒక్కసారిగా రోడ్డున పడేయడం ఎంతవరకు న్యాయం?" అంటూ ఆపరేటర్లు ప్రశ్నించారు. ఏడు సంవత్సరాలుగా ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్న తమ కుటుంబాల జీవనాధారం పూర్తిగా ఈ ఉపాధిపైనే ఆధారపడి ఉందని, ఉద్యోగాలు కోల్పోతే వందలాది కుటుంబాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. భూ రికార్డుల వ్యవస్థపై పూర్తి అవగాహన కలిగిన అనుభవజ్ఞులైన సిబ్బందిని తొలగించడం వల్ల ప్రజలకు సేవల్లో అంతరాయం ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

"ధరణి నుంచి భూ భారతి వరకు వ్యవస్థను నడిపింది మేమే. రైతులకు మార్గదర్శకులుగా నిలిచింది మేమే. రాత్రింబవళ్లు కష్టపడి ప్రభుత్వ లక్ష్యాలను సాధించాం. ఇప్పుడు మా సేవలను విస్మరించి మమ్మల్ని బయటకు పంపించడం బాధాకరం" అని పలువురు ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి, తమ సేవలను గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని యథావిధిగా విధుల్లో కొనసాగించేలా చర్యలు చేపట్టాలని వారు మంత్రిని కోరారు. రెవెన్యూ శాఖలో ప్రస్తుతం ఈ అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఏడు సంవత్సరాలుగా వ్యవస్థకు సేవలందిస్తున్న భూ భారతి ఆపరేటర్ల భవిష్యత్తుపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అన్నది రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది. ఒకవైపు ఉద్యోగ భద్రత కోసం ఆపరేటర్లు పోరాటానికి సిద్ధమవుతుండగా, మరోవైపు ప్రభుత్వం తీసుకునే నిర్ణయం వేలాది కుటుంబాల భవిష్యత్తును నిర్ణయించనుంది. మంత్రితో మహబూబ్ నగర్ జిల్లా నుంచి కూడా ధరణి ఆపరేటర్ లు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసం పోరాటాలే శరణ్యం

**కార్మికుల హక్కుల సాధనకు ఐక్య పోరాటాలు ముమ్మరం చేయాడానికి సిద్ధం కావాలి**

**ఏఐటీయూసీ మున్సిపల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి పిలుపు**

ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 04 (మనం బ్యూరో) : తెలంగాణలోని మున్సిపల్, జీహెచ్ఎంసీ, మున్సిపల్ కార్పొరేషన్లలో దశాబ్దాలుగా ప్రాణాలను పణంగా పెట్టి సేవలు అందిస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, పారిశుధ్య కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ అండ్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ూ×ుఖజ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఖమ్మం జిల్లా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) సర్వసభ్య సమావేశంలో మంగళవారం జిల్లా అధ్యక్షుడు బుర్రి ఉపేంద్ర అధ్యక్షతన స్థానిక గిరి ప్రసాద్ భవనంలో జిల్లా నాయకత్వ సమక్షంలో అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ... మున్సిపల్ కార్పొరేషన్, మునిసిపాలిటీలలో పనిచేసే డ్రైవర్లకు జీవో నెంబర్ 60 ప్రకారం కనీస వేతనం రూ.19500/- కేసీఆర్ పెట్టిన మేడే సందర్భంగా పెంచిన వెయ్యి రూపాయలు కలుపుకొని డ్రైవర్లకు రూ. 20,500 అందులో నుండి ఈఎస్ఐపిఎఫ్ కట్టయ్యి రూ. 18000 వచ్చే వేతనాన్ని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పైన డిపార్ట్మెంట్లో పరంగా ఇచ్చేటువంటి జీవో నెంబర్ 1181 విడుదల చేసి 16,600 ఇవ్వడం అనేది దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. వెంటనే మున్సిపల్ లో పనిచేసేటువంటి డ్రైవర్లకు యధావిధిగా వేతనాలు రూ. 20,500 అమలు చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. పట్టణాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న పారిశుధ్య, డ్రైవర్, ఇతర ఔట్ సోర్సింగ్ సిబ్బందికి శ్రమకు తగ్గ ప్రతిఫలం దక్కడలేదని జైపాల్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మిగిలిపోయాయన్నారు. క్షేత్రస్థాయిలో రక్షణ పరికరాలు, సరైన వైద్య సదు-పాయాలు లేక ఎంతో మంది కార్మికులు దుర్భర జీవితం గడుపుతున్నారని వాపోయారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులందరినీ తక్షణమే రెగ్యులరైజ్ చేయాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి 'సమాన పనికి సమాన వేతనం' సూత్రాన్ని వర్తింపజేసి, నెలకు కనీస వేతనం రూ.26,000 చెల్లించాలన్నారు. పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని క్రమం తప్పకుండా హజార్డ్ అల్లావెన్స్ చెల్లించడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలను పక్కాగా అమలు చేయాలి. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు పేరబోయిన మోహన్ రావు, జిల్లా సమితి సభ్యులు బోడ వీరన్న, సతీష్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరేకంటి కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ రాయపూడి శ్రీను, ఉపాధ్యక్షులు సయ్యద్ వజీర్ మియా, ఇటికాల వెంకటేశ్వరరావు, కార్యదర్శులు అలవాల రాహేలు, తాటి నాగేంద్రబాబు, కోశాధికారి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

**యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడడం మన అందరి బాధ్యత**

**నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్**



మ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 04 (మనం బ్యూరో) : నాగర్‌కర్నూలు జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, గంజాయి వంటి మత్తు పంటల అక్రమ సాగు నియంత్రణ, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా అవసరమైన చర్యలను అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నాగర్‌కర్నూలు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, తో కలసి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ అధ్యక్షతన జిల్లా స్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ (చీజూ=ఐ) కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలు, వినియోగంపై సంబంధిత శాఖలు నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. గంజాయి, వంటి మత్తు పంటల అక్రమ సాగు ఎక్కడైనా గుర్తించిన వెంటనే చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. అంతర్రాష్ట్ర మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసుల్లో సమాచార మార్పిడి, సమన్వయం మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో పోలీసు, విద్య, వైద్య, ఎక్సైజ్ తదితర శాఖలు పరస్పర సహకారంతో పనిచేయాలని సూచించారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలన్నారు. సంబంధిత శాఖలు సమిష్టి బాధ్యతతో చర్యలు చేపట్టాలని, యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యపరమైన దుష్పరిణామాలు, కుటుంబాలపై వాటి ప్రభావం, ఎన్‌డీపీఎస్ చట్టం నిబంధనలు, చట్ట ప్రకారం విధించే కఠిన శిక్షలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. మత్తు పంటల సాగు ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు డ్రగ్స్ గుర్తింపునకు అవసరమైన పరికరాల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలోని డీ-అడిక్షన్ (వ్యసన విముక్తి) మరియు పునరావాస కేంద్రాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ వ్యసన బాధితులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖ నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ, సున్నితమైన ప్రదేశాలలో సమ-ర్థవంతమైన నిఘాతో డ్రగ్స్ నిర్మూలనకు చ్యరలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో, కాలేజీల పై ప్రత్యేక నిఘాతో పర్యవేక్షించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు అన్ని శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి, డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు సమిష్టిగా పనిచేయాలని తెలిపారు. అక్రమ రవాణాపై నిరంతర నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మాదకద్రవ్యాల నియంత్రణ లో ప్రభుత్వ యంత్రాంగంతో పాటు విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల భాగస్వామ్యం కూడా అత్యంత కీలకమన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన ఒక శాఖ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని అన్ని వర్గాలు సమిష్టిగా కృషి చేసినప్పుడే ఆశించిన ఫలితాలు సాధించగలమని, కలెక్టర్ పాటిల్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని సంబంధిత శాఖలతో సమన్వయం పెంచుకుంటూ పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలు, వినియోగాన్ని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు నిరంతర నిఘా కొనసాగిస్తున్నామని, డ్రగ్స్ మాఫియాపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలకు చైతన్యం కల్పిస్తున్నామని తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు వెంటనే పోలీసులకు అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసు, ఎక్సైజ్, అటవీ, విద్య, వైద్య, వ్యవసాయ తదితర శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం, యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడడం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవడం లక్ష్యంగానే జిల్లా స్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశంలో నిర్ణయించిన అంశాలను పరిగణనలోకి తీసుకుని చర్యలు తీసుకుంటామనిజిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తెలిపారు. ఈ సమావేశంలో, అదనపు కలెక్టర్లు చెన్నయ్య దేవ సహాయం, అదనపు ఎస్పి వెంకటేశ్వర్లు,జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్, అన్ని సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను సమన్వయంతో ఘనంగా నిర్వహించాలి

**నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్**

ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 04 (మనం బ్యూరో) : ఈ నెల 15న. నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జాతీయ భావం ఉట్టిపడేలా ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలను సమన్వయంతో నిర్వర్తించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సూచించారు. మంగళవారం నాగర్‌కర్నూలు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్,అదనపు కలెక్టర్లు చెన్నయ్య, దేవ సహాయం,అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లుతో కలిసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 15న. జరిగే వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖల తరఫున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, పుర ప్రముఖులు, అతిథులకు ఆహ్వాన పత్రాలు అందజేయాలన్నారు. జిల్లా ప్రగతిపై రూపొందించే సందేశం సీపీఓ, రూపొందించాలని ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను విద్యాశాఖ అధికారులు చేపట్టాలని, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే అగ్నిమాపక యంత్రాలను సిద్ధంగా ఉంచడం, తాగునీరు, స్నాక్స్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించడం, వేదిక అలంకరణ, పూలమొక్కల ఏర్పాటు, తివాచీలు, బ్యారికేడ్లను పటిష్టంగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పోలీసు బందోబస్తు, గౌరవ వందనం, పోలీసు బ్యాండ్ తదితర ఏర్పాట్లను ఎలాంటి లోపాలకు తావులేకుండా సమ-ర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా గ్రామీణాభివృద్ధి, పశు సంవర్ధక, విద్య, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం, పౌర సరఫరాల, పంచాయతీరాజ్, తదితర శాఖల పనితీరును చాటేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రొటోకాల్ ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, వేడుకలు విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ధాన్యం చెల్లించని రెండు మిల్లులపై కేసులు నమోదు

**సివిల్ సప్లై డిఎం ఆంజనేయులు**

**రూ.28.87 కోట్ల విలువైన 7571 మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయి**

వనపర్తి ఆగస్టు 4 (మనం ప్రతినిధి) ప్రభుత్వానికి చెల్లించాల్సిన ధాన్యాన్ని అప్పగించని రెండు రైస్ మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి ఎన్. అంజనేయులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లాలోని రైతు అగ్రో ఇండస్ట్రీస్ మిల్లు 6184.297 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని చెల్లించలేదని దీని విలువ రూ. 23,06,87,947. కాగా ఈశ్వర ట్రేడర్స్ మిల్లు 1386.894 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సకాలంలో చెల్లించలేదని తెలిపారు. దీని విలువ రూ.



5,80,36,782. ఉందని మొత్తంగా రెండు మిల్లుల నుంచి 7571.191 మెట్రిక్ టన్నుల ధాన్యం రూ. 28,87,24,729 విలువతో బకాయి ఉందని సివిల్ సప్లై డిఎం ఆంజనేయులు స్పష్టం చేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి సిఎంఆర్ బియ్యాన్ని అప్పగించకుండా నిబంధనలు ఉల్లంఘించినందున మిల్లుల యజమానులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ ధాన్యం విషయంలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



# జిల్లాలో డిజిటల్ తెలంగాణ లక్ష్యాల సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, అవినీతిరహిత సేవలందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం**

**నాగర్ కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ చెన్నయ్య**



ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 04 (మనం బ్యూరో) : ప్రభుత్వ సేవలను పూర్తిగా డిజిటల్ విధానంలోకి తీసుకురావడంలో అధికారులు, మీ సేవ నిర్వాహకులు కీలకంగా వ్యవహరించాలి, అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న డిజిటల్ తెలంగాణ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పరిపాలనలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ఈ మార్పులను జిల్లా ప్రజలకు పూర్తిస్థాయిలో చేరవేయడంలో ప్రతి ప్రభుత్వ శాఖ, ప్రతి అధికారి, ప్రతి మీ సేవ కేంద్రం సమిష్టిగా కృషి చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య సూచించారు. సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రభుత్వ సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా, జవాబుదారీతనంతో ప్రజలకు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో సదరం పోర్టల్, నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం లేబర్ కార్డు, ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్‌తో పాటు వివిధ మీ సేవ సేవల అమలు విధానంపై జిల్లాలోని మీ సేవ కేంద్రాల నిర్వాహకులు, ఆపరేటర్లకు ఒకరోజు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య శిక్షణను ప్రారంభించి అధికారులకు, మీ సేవ నిర్వాహకులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం అందించే ప్రతి సేవ సులభంగా, వేగంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందుబాటులో ఉండేలా ప్రభుత్వం సమగ్ర డిజిటల్ వ్యవస్థను రూపొందించిందన్నారు. గతంలో చిన్నచిన్న ధ్రువీకరణ పత్రాలు, సంక్షేమ పథకాల దరఖాస్తుల కోసం ప్రజలు పలుమార్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, భౌతిక పత్రాలు సమర్పించాల్సి వచ్చేదని, దీనివల్ల సమయం, ధనం, శ్రమ వృథా కావడంతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని చెప్పారు. ఈ పరిస్థితులకు శాశ్వత పరిష్కారం చూపించేందుకే ప్రభుత్వం డిజిటల్ సేవలను మరింత విస్తృతంగా అమలు చేస్తోందని వివరించారు. ఇకపై సదరం పోర్టల్, నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం లేబర్ కార్డు, ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్, కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు, జనన–మరణ ధ్రువీకరణ పత్రాలు, వ్యవసాయ మార్కెట్ విలువ ధ్రువీకరణ పత్రాలు తదితర అనేక ప్రభుత్వ సేవలు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రజలు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు సమర్పించిన వెంటనే సంబంధిత అధికారుల లాగిన్‌కు ఆ దరఖాస్తులు చేరే విధంగా ప్రభుత్వం అత్యాధునిక వ్యవస్థను రూపొందించిందన్నారు. గ్రామ పాలనాధికారులు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (ఆర్ఐలు), తహసీల్దార్లు, ఇతర సంబంధిత అధికారులు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన మీ సేవ మొబైల్ యాప్ ద్వారా క్షేత్రస్థాయిలోనే దరఖాస్తులను పరిశీలించి, అవసరమైన ధ్రువీకరణ ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. ఫైళ్లను అనవసరంగా పెండింగ్‌లో ఉంచకుండా, ప్రతి దరఖాస్తును వేగంగా పరిష్కరించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ప్రజలను చిన్నచిన్న పనుల కోసం కార్యాలయాలకు పదేపదే రప్పించడం, భౌతిక పత్రాలు కోరడం, అనవసరంగా ఆలస్యం చేయడం వంటి చర్యలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ప్రజలకు సేవ చేయాలనే బాధ్యతతో పనిచేయాలని, ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించకుండా సేవాభావంతో స్పందించాలని సూచించారు. ప్రభుత్వ సేవలపై ప్రజల్లో విశ్వాసం పెరగాలంటే అధికారులు సమయపాలనతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త డిజిటల్ విధానంలో దరఖాస్తు నమోదు చేసిన వెంటనే దరఖాస్తుదారుడి మొబైల్ నంబర్‌కు అప్లికేషన్ నంబర్, సేవ పేరు, చెల్లించిన రుసుము వివరాలతో కూడిన డిజిటల్ రసీదు ఎస్ఎంఎస్ రూపంలో అందుతుందని తెలిపారు. ఆ సందేశంలోని లింక్ ద్వారా దరఖాస్తు స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని, రసీదును డౌన్‌లోడ్ చేసుకోవడం, ప్రింట్ తీసుకోవడం కూడా సులభమని చెప్పారు. దీంతో గతపు రసీదులు పోగొట్టుకోవడం, మళ్లీ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం వంటి సమస్యలు పూర్తిగా తొలగిపోతాయని, డిజిటల్ తెలంగాణ కార్యక్రమం కేవలం సాంకేతిక మార్పు మాత్రమే కాదని, ప్రజలకు మరింత సమర్థవంతమైన, అవినీతిరహిత, పారదర్శకమైన పాలన అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన సమగ్ర పరిపాలనా సంస్కరణ అని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ సేవలను ప్రజల గడప వద్దకే తీసుకెళ్లడం, ప్రతి అర్హుడికి సమయానికి సేవలు అందించడం, ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్ ద్వారా పారదర్శకంగా పరిష్కరించడం ప్రభుత్వ సంకల్పమని అన్నారు. ఈడిఎం నరేష్ మాట్లాడుతూ జిల్లాలోని మీ సేవ కేంద్రాల నిర్వాహకులు ప్రజలకు సరైన మార్గనిర్దేశం చేయాలని, దరఖాస్తుల నమోదులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే గ్రామ పాలనాధికారులు, రెవెన్యూ అధికారులు, అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేసి డిజిటల్ సేవలను గ్రామీణ స్థాయి వరకు సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. జిల్లాలో డిజిటల్ తెలంగాణ లక్ష్యాలను విజయవంతంగా అమలు చేయడంలో ప్రతి శాఖ, ప్రతి అధికారి, ప్రతి మీ సేవ నిర్వాహకుడు కీలక భాగస్వామి అని, ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, నాణ్యమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ లక్ష్య సాధనకు అందరూ అంకితభావంతో పనిచేయాలని వివిధ అంశాలపై శిక్షణ తరగతులను ఆయన నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో డీపీఎం శ్రీనివాసులు, లేబర్ ఆఫీసర్ రాజ్‌కుమార్, మీ సేవ సూపరింటెండెంట్ శోభ, జిల్లా మేనేజర్ నరేష్ తో పాటు పాటు జిల్లాలోని అన్ని మీ సేవ కేంద్రాల నిర్వాహకులు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

## కొలువు తీరని 'అక్షరాల గుడి'..పేపర్ పాఠకులకు నిరాశేనా?

**గ్రంథాలయ జ్ఞానాల గని..ఏర్పాటయ్యేనా?**



ఊరుకొండ ఆగస్టు 4 (మనం న్యూస్) : స్థానిక మండల కేంద్రంలో సోమవారం కొత్తగా మండల అయితే ఏర్పడింది.కానీ అక్షరాల పొదరిల్లు జ్ఞానాల గని గ్రంథాలయం మాత్రం ఇంకా మొలకెత్తనేలేదు. "మనం "పేపర్ ప్రత్యేక వార్త కథనం విశ్లేషించి.ఊరంతా ఒక ఎత్తైతే,ఊరి కొక్కలైబ్రరీ ఉండాలన్నదే చదువుల తమ్ముళ్ల ఆశ.నూతన మండలం ఏర్పటయ్యాక ఊరు వాడ ఊపు మీదున్న,చదువుల కోవెల జాడ లేకపోవడంతో పుస్తకాల పురుగుల మనసులు విలవిలలాడుతున్నాయి.జ్ఞానం పెంచే గ్రంథా లయం ఎప్పుడు వస్తుందో మండలానికి ఈ నిలయం అంటూ పెద్ద,పెద్ద బంగ్లాలు వస్తున్నాయి.సర్కారు కార్యాలయాలు రావడానికి పచ్చని తివాచి పరుస్తున్నారు.కానీ విజ్ఞానాన్ని పంచే విద్యా నిలయానికి చోటే కరువైంది.ఈ మండల ప్రజల నిరాశ ఎప్పుడు తీరుతుందోనని అక్షర ప్రేమికులు అత్యంత ఆశతో ఎదురుచూస్తున్నారు. చదువుల తల్లి కొలువుదీరితేనే నూతన మండలానికి అసలైన కల,గౌరవం దక్కుతుందని ప్రజల భావ ప్రకటన.తెల్లవారితే పేపర్ కావాలి ముసలి,ముతకకు ముచ్చట తీరాలి.పొద్దు పొడిచింది మొదలు 'చేతిలో చాయ్ కప్పు' కళ్ళ ముందు"దినపత్రిక"కదలాడకపోతే మన ఊరి పెద్దలకు తెల్లవారినట్లే ఉ ండదు.విదేశాల వార్తలు పేజీలు తిప్పేటి ముచ్చట్లు.రాజకీయాల,రచ్చబండలు,రసవ త్తరమైన చర్చలు,రమణీయమైన ప్రకృతి అందాలు. వాణిజ్య వ్యాపారాలు, సినిమాలోకం, బాలల వినోదాలు,చదువుకునే పిల్లల ఆరాటాలు,నిరుద్యోగుల నోటిఫికేషన్లు, ఇవన్నీ ఒకే చోట దొరికేది మన (లైబ్రరీ)గ్రంథాలయంలోనే, కానీ ఇప్పుడు ఆ సదుపాయం లేక పేపర్ పాఠకులకు నిరాశే మిగులుతోంది.సొంతంగా పేపరు అందుబాటులో లేని చదవరుల కళ కళంకమేనా?ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు నూతన మండలంలోని వెంటనే 'గ్రంథాలయా జ్ఞానాల గనిని'ఏర్పాటుచేసి జ్ఞానాన్ని వెతుక్కునే పాఠక ప్రేమికులకు,అక్షర అన్వేషణ కోసం,చతికిలబడి పోతున్న,అభిమానులకు నూతన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి,మండల కేంద్రం ప్రజల ఆవేదనను ఇకనైనా గుర్తించాలి.అక్షరాల దుమ్ము,దులిపి పుస్తకాల పచ్చని తోరణం కట్టాలి.నిరాశలో ఉన్న పేపర్ పాఠకుల కళ్ళల్లో ఆనందం నింపేలా,నూతన మండల కేంద్రంలో తక్షణమే భవనాన్ని కేటాయించి గ్రంథాలయా వెలుగులు నింపాలని,మండలాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకుపోవాలని గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారు..

## ఇంటర్మీడియట్ విద్యార్థులు కష్టపడి లక్ష్యాలు సాధించాలి

కోదాడ, ఆగష్టు 04(మనం న్యూస్) : ఇంటర్మీడియట్ విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో తాము అనుకున్న లక్ష్యలను సాధించాలని ఎన్ఆర్ఎస్ కాలేజీ ఛైర్మన్ వడ్డే రాజేష్ చౌదరి అన్నారు. మంగళవారం కాలేజ్ లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు నిర్వహించిన ఫ్రెషర్ పార్టీలో ఆయన పాల్గొని మాట్లాడారు.విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ దశ కీలకమని ఇక్కడినుండే విద్యార్థి భవిష్యత్తు లక్ష్యాల సాధన ప్రారంభమవుతుందన్నారు. ఇలాంటి ఇంటర్మీడియట్ విద్యలో విద్యార్థులు రాణించేందుకు తమ కాలేజ్ లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. జూనియర్ విద్యార్థులు భయం వీడి సీనియర్ విద్యార్థులతో కలిసిపోవడానికి ఫ్రెషర్ పార్టీ లు ఉపయోగపడతాయని అన్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్స్ కు మార్గదర్శకులుగా ఉండి వారికి సహాయ, సహకారాలు అందించాలని కోరారు. అనంతరం సీనియర్, జూనియర్ విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కాలేజ్ డైరెక్టర్ మనోహర్ రెడ్డి, కరస్పాండెంట్ వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ గంధం వెంకటరమణ (జీ వీ), వైస్ ప్రిన్సిపల్ పీఎన్ఆర్, పలువురు లెక్చరర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

